
# సూర్య ఆదివారం

www.suryaa.com

27.10.2024

# వంద వత్సరాల హైదరాబాద్ అంగడులు

## చైర్మన్‌తో ముఖాముఖి


నూకారపు సూర్యప్రకాశరావు
చైర్మన్, నేటి దిన పత్రిక సూర్య

**ఓర్వకల్లులో డ్రోన్ హబ్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించడం వెనుక అనేక కారణాలు ఉన్నాయని పిస్తోంది. ప్రత్యేక హబ్ ఏర్పాటుతో తయారీ పరిశ్రమలు, డ్రోన్ టెస్టింగ్ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయనిపిస్తోంది. మీరేమంటారు సర్**

**కె. వినయ్ కుమార్, విజయవాడ**

మీరన్నది నిజమే వినయ్‌గారూ... వీరు చెపుతున్నది నిజమే .. శిక్షణ, సర్టిఫికేషన్, అసెంబ్లింగ్ యూనిట్లు, రిపేర్లు, నిర్వహణ సేవలు, డాస్ (డ్రోన్స్ యాజ్ ఎ సర్వీస్) ఎకోసిస్టం అభివృద్ధి చెందుతుంది . ఈ సదుపాయాలతో అంకుర పరిశ్రమలు పెరుగుతాయని చెప్పారు. ఏపీలో డ్రోన్ సంబంధిత వ్యాపారాలకు అవసరమైన అన్ని అనుమతులను సింగిల్ విండో విధానంలో ప్రభుత్వం అందిస్తుంది

ఓర్వకల్లులో ఏర్పాటు వెనుక దగ్గరలో ఉన్న కర్నూలు విమానాశ్రయంలోని రన్‌వేను డ్రోన్ల పరిశీలనకు వినియోగించుకోవచ్చు. డ్రోన్ తయారీ పరిశ్రమలకు అవసరమైన అనుబంధ కంపెనీల ఏర్పాటుకు 10,000ల ఎకరాల వరకు అందుబాటులో ఉంటుంది. హైదరాబాద్- బెంగళూరు నగరాలకు దగ్గరగానూ ఉంటుంది. ఇక్కడ ఏర్పాటు చేసే సంస్థలకు అనుమతులన్నీ ప్రభుత్వమే సమకూర్చుతుంది. ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించడం వల్ల డీజీసీఏ అనుమతులు అక్కర్లేదు. కాగా ఏపీలో ఇతర ప్రాంతాల్లోనూ డ్రోన్ పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులిచ్చేందుకు అధికారులు సిద్దమని చెపుతున్నారు. అయితే అవసరమైన డీజీసీఏ, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అనుమతులు, ఇతర లైసెన్సులు వారే సమకూర్చుకోవాల్సి ఉంటుంది.

అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఇది మంచి మార్గంగానే కనిపిస్తోంది. డ్రోన్ల రంగంలో మన దేశ వాటా కేవలం 3 శాతమే . దీన్ని కనీసం 20 శాతానికి పెంచాలని కేంద్రం భావిస్తోంది. ఇందులో రానున్న విస్తృత అవకాశాలను అందిపుచ్చుకునేందుకు వీలుగా ఏపీ సర్కార్ విధానాలు రూపొందిస్తోందించేలా ప్రయత్నాలు ఆరంభించింది. . డ్రోన్ల వినియోగానికి విస్తృత అవకాశాలున్న మ్యాపింగ్, సర్వే, వ్యవసాయం, ఫొటోగ్రఫీ, తనిఖీలు, నిఘా రంగాలను కీలకంగా మారనున్నాయి.

'విభిన్న రంగాలు, ప్రభుత్వ శాఖల్లో డ్రోన్ల వినియోగం, ప్రోత్సాహకాలు, కృత్రిమ మేధతో అనుసంధానం, తయారీ రంగాన్ని ప్రోత్సహించే వాణిజ్య విధానం వంటివి అందుబాటులోకి తేవడం. తద్వారా డ్రోన్ అనుకూల వాతావరణాన్ని రాష్ట్రంలో కల్పించాలని యోచిస్తోంది. ఏపీలో డ్రోన్ల రంగం ద్వారా ఐదేళ్లలో రూ.6000ల కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ రంగంలో రూ.వెయ్యి కోట్ల పెట్టుబడులు 12,500 మందికి ఉపాధి కల్పించేలా ముసాయిదా డ్రోన్ పాలసీని ప్రకటించింది. దీనిపై భాగస్వామ్య పక్షాలు, నిపుణుల సూచనల ఆధారంగా మార్పులు చేసి నవంబరు నాటికి తుది పాలసీని తీసుకొచ్చే ఆస్కారంఉందనిపిస్తోంది.

**హైదరాబాద్ నగరంలోని సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలని హైడ్రా నిర్ణయించినట్టు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే గత నెల రోజులుగా కమిషనర్ ఏపీ రంగనాథ్ వివిధ రంగాల నిపుణలతో సమావేశాలు నిర్వహించి ప్రణాళికలు రూపొందించడంతొ పాటూ కేవలం కూల్చివేతల కోసమే హైడ్రా ఏర్పడిందన్న ముద్రను చెరిపివేసుకోనేలా ఇతర సమస్యలపై దృష్టి సారించనున్నారనిపిస్తోంది. దీంతో కూల్చివేతలు తాత్కాలికంగా ఆపేయాలని నిర్ణయించారన్నది ఓ వార్త మీరేమండటూరు.**

**పసుపులేటి వింధ్యారాణి, ప్రగతినగర్, హైదరాబాద్**

అవును మీరు చెపుతున్నది వాస్తవమే వింధ్యగారూ... తొలి నాళ్లలో కూల్చి వేతలను స్వాగతించిన వారు, అవి విస్తృతమై తమ వరకు వచ్చేసరికి సహించలేకపోతున్నారన్నది వాస్తవం. ఈ క్రమంలో దానిని వ్యతిరేకించడం ఆరంభించారు. దీంతో ఆ అపత్రద తుడుచుకునేలా... గ్రేటర్ పరిధిలో ఇతర సమస్యలపైనా హైడ్రా దృష్టి సారించిందనే చెప్పాలి. తెలంగాణ రాజధానిలో నిత్యం 50లక్షలకు పైగా వాహనాలు రోడ్డెక్కుతున్నాయి. చిన్నపాటి వాన పడినా గంటల తరబడి రోడ్లపై ఉండాల్సిందే. ఈ సమస్యపై ట్రాఫిక్ పోలీసులు, బల్దియా అధికారులతో కలిసి పరిష్కరించాలని ఆలోచిస్తున్నారు. దీని పరిష్కృతం కోసం 2 విద్యా సంస్థలకు సర్వే బాధ్యతలు అప్పగించారు. పరిష్కారాలపై సీఎం రేవంత్ రెడ్డికి ఓ నివేదిక సమర్పించి చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. వాహన రద్దీ సమస్యతో పాటు ఫుట్‌పాత్, రహదారి ఆక్రమణలపై నగర ట్రాఫిక్ విభాగంతో కలిసి పని చేయాలని నిర్ణయించింది.

నేషనల్ రిమోట్ సెన్సింగ్ విభాగం తీసిన ఫొటోలు, మ్యాప్లతో చెరువు వాస్తవ విస్తీర్ణం, మొత్తం చరిత్రను తీసి నిక్షిప్తం చేసేందుకు యత్నిస్తున్నారు. చెరువులపై ఉన్న ఆక్రమణల్లో దాదాపు 85శాతం నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయి. వీటిని కూల్చడం సాధ్యం కాదని అభిప్రాయపడ్డ హైడ్రా అధికారులు ఉన్న చెరువును పరిరక్షించాలని నిర్ణయించారు. నగరంలోని కొన్ని చెరువుల సుందరీకరణను నవంబరులో ప్రారంభించాలని యోచిస్తున్నారు.

హైదరాబాద్లో సుమారు 200 కి.మీ.ల మేర నాలాలు ఉన్నాయి. వీటిపై సుమారు 15వేల నిర్మాణాలు ఉన్నాయని గతంలో అధికారులు గుర్తించారు. వీటిని కూల్చడం ప్రభుత్వానికి అసాధ్యం. చాలా వాటికి బల్దియా పర్మిషన్స్ ఉన్నాయి. బాధితులకు పరిహారం ఇవ్వాలంటే రూ.వేల కోట్లు కావాల్సిందే. పెద్ద నాలాల పరిధిలో సుమారు 1400 చోట్ల మూడొంతుల ఆక్రమణకు గురై వర్షం నీరు కిందికి వెళ్లడం లేదు. వీటిని తొలగించి నాలాలను విస్తరిస్తే వరద నీటి ముంపు సమస్య తొలుగుతుంది. బల్దియాతో కలిసి దశల వారీగా ఈ పనులు చేయాలని హైడ్రా సిద్ధమైంది.

# పాటల అక్షర శిల్పి శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి

లెజెండ్




(గతవారం తరువాయి)

కృష్ణ శాస్త్రి విశిష్ట రచనల్లో ఊర్వశి కావ్యము ,అమృతవీణ - 1992 - గేయమాలిక,అమూల్యాభిప్రాయాలు - వ్యాసావళి,బహుకాల దర్శనం - నాటికలు,కథలు,ధనుర్దాసు - నాలుగు భక్తీ నాటికలు ,కృష్ణశాస్త్రి వ్యాసావళి - 4 భాగాలు,మంగళకాహళి %-% దేశభక్తి గీతాలు,శర్మిష్ఠ - 6 శ్రవ్య (రేడియో) నాటికలు,శ్రీ ఆండాళ్ళు తిరు-ప్పావు కీర్తనలు, నాటిక 1993, మేఘమాల - సినిమా పాటల సంకలనం -% 1996, శ్రీ విద్యావతి - శృంగార నాటికలు, యక్షగానాలు - అతిథిశాల - సంగీత రూపకాలు, మహతి, వెండితెర పాటలు - 2008 ఉన్నాయి.

గొప్ప వక్తగా, రచయితగా, భావకవుల ప్రతినిధిగా పేరుపొందిన కృష్ణశాస్త్రి గొంతు 1963లో అనారోగ్యకారణంగా మూగవోయింది. కాని అతని రచనా పరంపర కొనసాగింది. అతనికి అనేక సన్మానాలు ప్రశంసలు (1975 - ఆంధ్ర విశ్వవిద్యాలయం - కళాప్రపూర్ణ, 1978 -సాహిత్య అకాడమీ అవార్డు,1976 %-% పద్మ భూషణ్) లభించాయి. అభ్యుదయ కవిత్వానికి మార్గదర్శియై, ఆధునిక మహా భారతం వంటి మహా ప్రస్థానం రచించిన శ్రీశ్రీ కూడా కృష్ణ శాస్త్రి కవిత్వ ప్రభావానికి గురెట్కన వాడే! తర్వాత తర్వాత చలం 'కృష్ణ శాస్త్రి బాధ ప్రపంచానిది, ప్రపంచపు బాధ శ్రీశ్రీది' అన్నప్పటికీ ఆయన కవిత్వంలో పదాల అల్లిక, భావచిత్రాలు, ఇమేజినేషన్, పదలాలిత్యం పఠితల హృదయాల్లో ముద్రించుకు పోయాయి!

1980 ఫిబ్రవరి 24న దేవులపల్లి వారు కన్ను మూస్తే మహాకవి శ్రీ శ్రీ 'షెల్లీ మళ్ళీ మరణించాడు' 'తెలుగు దేశపు నిలువుటద్దం బ్రద్దలైంది' 'వసంతం వాడి పోయింది' అని అశ్రు తర్పణం చేసారు. 'అచ్చంగా వసంత మాసం వచ్చే దాక' ఆగక 'తొందర పడి కోయిల ముందే కూసింది' అంతకు పదేళ్ళ క్రితమే 'రానిక నీ కోసం సఖీ, రాదిక వసంత మాసం' అనీ. కానీ ఈ భావ గడసరి కోయిలకు తెలుసు, ఎప్పటికీ తను వేసినది చిక్కు ప్రశ్న గానే మిగిలి పోతుందనీ- 'మావి చిగురు తినగానే కోవిల పలికేనా? కోవిల గొంతు వినగానే మావి చిగురు తొడిగేనా?' అన్నదే ఆ ప్రశ్న. ఆ సమాధానం దొరికేంత వరకూ తనను మరచి పోరనీ ఆయనకు తెలుసు. "ఎన్నడో మీరు పాడిన దీ వసంత మధుర జీవనగీతి! హేమంత దీర్ఘయామినీ మధ్యవేళయే యైన, నేడుకూడ, నా యెద, త్రుళ్ళింత లాడుచుండు" "ఏ మనోహర సీమలం, దే పవిత్ర విమల తేజోమయ విశాల వీథులందు,అక్ష రామోద సంభరి తాంతరంగులగుచు, విహరించుచున్నారొ". ⌐



## నవ కవిత్వం

### పురుగు పడితే..!



మొక్కకు పురుగు పడితే..
మందు పిచికారీతో క్రిమిని
సంహరిస్తాం
చెడు సహవాస చెదలు పడితే..
సద్బుద్ధి మందేసి ఆదిలోనే
తుంచేద్దాం !

తుమ్మ చెట్టుకు గొడ్డలితో కాటు
వేస్తే..
జిగురు బంక ఉబికి కారుతుంది
మనసుకు కాసింత గాయమైతే..
కన్నీరు దారలుగా పారుతుంది !

నెత్తిన పేను పడితే..
దువ్వెనతో ఏరి ఏరి పట్టి చంపుతాం
సమాజంలో నీచులు కనబడితే..
తెలివిగా కంపు కంపను పీకేద్దాం !

పాదానికి చెప్పు సైజు తగ్గితే..
పాదాలకు గాయాల రక్త మరకలు
సైజు పెరిగితే అడుగుల తడబాట్లు..
సంపాదన సరిపోయేంతే ఉండాలి
తక్కువైతే బతుకు వెతల బాధలు
ఎక్కువైతే కొవ్వెక్కి ముసిరే రోగాలు !

బలిసినోడి ప్యాంటుకు ఫ్యాషన్
బొక్కలు
బడుగు చొక్కా తూట్లు కటిక
దారిద్ర్యాలు
నిలువ నీటిలో విపరీత నాచు
పెరుగుద్ది
సదాలోచనేలేని మనిషి మెదడుకు..
దురాలోచనల చెదలు పడుతుంది !


**మధుపాలీ,**
**9949700037**

## లేఖలు

**ముఖచిత్ర కథనం**

తమ కన్న కొడుకు మరణం తీరన వేదన కలిగించిన నేపథ్యంలో తమ కటుంబం వారసత్వం నిర్వీర్యమై పెట్టకూడదన్న లక్ష్యంతో తమ కుమారుడి వీర్యాన్ని కోరుతూ పోరాటం చేసిన తల్లిదండ్రులకు లాల్ సలాం చేయకతప్పదు. వారి పోరాటంం ఫలించిన తీరు పై ప్రత్యేక కథనాన్ని ఆదివారం అనుబంధంలో ప్రచురించడం బాగుంది. అన్ని పత్రికలకు విభిన్నంగా భిన్న అంశాలను ముఖపత్ర కథనాలుగా ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి, యాజమాన్యానికి ధన్యవాదాలు. ఈ తరహా మరిన్ని కథనాలు ప్రచురించాలని కోరుతున్నాము. సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఒతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుం టుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని నా మనవి.

**– వారాంతపు రజనీ, వరంగల్**




**–బి మధుశేఖర్, హైదరాబాద్**

**సినిమా రివ్యూలు బాగున్నాయ్**

వారం వారం విడుదలవుతున్న చిత్రా లలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుఫణుల పనితీరును అర్ధవంతంగా వివరి స్తున్న విశ్లేషకు లకు ధన్యావాదా లు. ప్రధానంగా ధియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.

**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరం దిస్తున్న ప్రోత్సాహం బాగుం ది. . రచిత కథనాన్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచ నలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు

**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**


## సలామ్ సలామ్





అమూల్యం
పోలీస్ యూనిఫామ్ లో
ఒక లుక్
వారు లేకపోతే ఝలక్
శరీరానికి గుండె
అంతర్గత రక్షణకు పోలీస్
పండుగ లేదు పబ్బం లేదు
ఉన్నత అధికారుల వేధింపులు
శ్రమ కు లేదు అలసట
సాంఘిక విద్రోహ శక్తుల
అణచివేత లో ప్రాణాలు హరి
ట్రాఫిక్ మనకు బేఫికర్
డ్యూటీ చేసే వాడికి అనారోగ్యపు
ఆనవాళ్లు స్వాగతం
పొట్ట తిప్పాలకు ఉద్యోగం
చెయ్యాలి అవసరమైతే
ఎన్ కౌంటర్
సెలవులు హుష్ కాకి
బిపి,షుగర్,హై టెన్షన్
ఒంట్లో ఏరులై పారుతాయి
పదవి విరమణ వరకు
జీవించే వారి సంఖ్య
ప్చ్ ప్చ్ ప్చ్
టెన్షన్ తట్టు కోలేక ఆత్మహత్యలు
నాయకుల విన్యాసాలకు
భద్రతజి
సలామ్ సలామ్
లేదంటే సస్పెన్షన్
నీతిగా ఉంటే ట్రాన్స్ఫర్
వాళ్ళు లేకపోతే
అంత మిథ్య
డ్యూటీ లో ప్రాణాలు
కోల్పోయిన నిజాయితీ
గల పోలీస్ సోదరుల
త్యాగాలకు ఒక సెల్యూట్
తో సరిపెట్టగలమా
నిరూపమానం నీ సేవలు
నీ త్యాగాల పునాదులు
మమ్ముల్ని నిలబెట్టుతున్నాయి
నీకు వందనం పోలీస్ వీరుడా
నీకు జోహార్ జోహార్

**ఉమాశేషారావు వైద్య**
**9440408080**

నారు




సూర్య బుడత

బాలల కథ



# కోడి గర్వం



నరసింహపురంలోని శరభయ్య ఒక కోడిని పెంచసాగాడు. అతడు పెట్టిన దాణా తింటూ ఆ కోడి బలంగా తయారైంది. బలంతో పాటు దానికి గర్వం కూడా ఎక్కువైంది.


ఒకరోజు అది గర్వంతో ఆ గ్రామానికి వచ్చిన సన్యాసి వద్దకు వెళ్లి ఆయనతో " ఓ స్వామీ! నేను చాలా తెలివిగలదానిని. నాకు చాలా బలం ఉంది. నన్ను మించిన వారు ఎవరూ లేరు. నా యజమానికి నేనంటే చాలా ఇష్టం. నన్ను వదిలిపెట్టి ఆయన క్షణం కూడా ఉండలేడు. ఆయన ఇంట్లో నేను ఆడింది, ఆట పాడింది పాట. ఆయనకు సంతానం లేదు. నేనే ఆయన బిడ్డను" అని అంది. అది విన్న సన్యాసి" ఓ కోడీ! నీవు గర్వంతో మిడిసి పడకు. నీకు త్వరలో ప్రమాదం ముంచుకొస్తున్నది. జాగ్రత్త సుమా!"అని హెచ్చరించాడు. కోడిపుంజు ఆయన మాటలను లెక్క చేయలేదు .


ఆ కోడి యజమాని శరభయ్య చాలా బీదవాడు. అతడు తన అవసరం నిమిత్తం ఆ కోడిని ఒక వ్యక్తికి అమ్మజూపాడు. అప్పుడు ఆ కోడికి దిగులు పట్టుకుంది. "ఆ సన్యాసి చెప్పినట్లు తనను ఆ కొనే వ్యక్తి పండుకొని తింటాడేమో !"అని అనుకుంది. అది శరభయ్యతో "అయ్యా! మీకు బిడ్డ లాంటి దాన్ని . చాలా రోజులుగా మన ఇంట్లోనే ఉంటున్నాను. మీరు నన్ను మరొకరికి అమ్మ చూపుతారా! అతడు నన్ను తప్పక చంపి వండుకొని తింటాడు. నాకు మీకు అనుబంధం ఇదేనా!" అని ఏడ్చింది. దాని మాటలు విన్న శరభయ్య తన మనసును మార్చుకొని ఆ ఆసామికి దాన్ని అమ్మనని చెప్పాడు. ఆ వ్యక్తి అక్కడి నుండి వెళ్లిపోయాడు.


"ఆ సన్యాసి చెప్పిన ప్రమాదం తప్పిపోయింది . నా తెలివితోనే మా యజమానిని ఒప్పించి ఈ గండం నుంచి గట్టెక్కాను. ఇదంతా నా గొప్ప తనమే! ఇక నాకు ప్రమాదం లేదు . హ...హ...హ "అని ఆ కోడి నవ్వింది .


ఆ తర్వాత అది సంతోషం తో రోడ్డు పైకి వచ్చింది. ఇంతలో అప్పుడే వచ్చిన వాహనం ఒకటి ఆ కోడిని ఢీకొంది . దానికి తీవ్ర గాయాలైనాయి. అప్పుడు అది "అయ్యో ! విధి వ్రాతను ఎవరూ తప్పించుకోలేరు. ఆ గండం తప్పిందను కుంటే ఈ వాహన రూపంలో మరొక ప్రమాదం జరిగింది . ఇంకా నయం . నా ప్రాణాలు పోలేదు. కొన్ని రోజులు ఈ గాయాల బాధను అనుభవింపక తప్పదు . అందుకే పెద్దలు చెప్పిన మాటను పెడచెవిన పెట్టరాదు. ఆ సన్యాసి చెప్పినట్లు నేను అజాగ్రత్తగా ఉండడం వల్లనే ఈ ప్రమాదం జరిగింది" అని అనుకొంది. అప్పటినుండి అది గర్వం మాని పెద్దలు చెప్పిన మాటలను వింటూ ఎంతో బుద్ధిగా ఉండసాగింది.

**సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,**
**9908554535**











## సుమతీ శతకం

నవ్వకుమీ సభలోపల
నవ్వకుమీ తల్లిదండ్రి నాదులతోడన్
నవ్వకుమీ పరసతితో
నవ్వకుమీ విప్రవరుల నయ మిది సుమతీ !

తా. సభలలో నవ్వరాదు. తల్లిని, తండ్రిని, భర్తను, ఇతరుల భార్యను, బ్రాహ్మణులను చూచి నవ్వరాదు.

# ప్రమాదకరమైన వ్యాధుల నుండి మెనింజైటిస్ నివారణ శక్తి




విజయవాడ, 15 అక్టోబర్ ,2024: :వ్యాక్సిన్ ద్వారా నివారించగల ఒక తీవ్రమైన ఇన్‌ఫెక్షన్, మెనింజైటిస్. ఇది అతి తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగి ఉంటుంది. మరీ ముఖ్యంగా పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రపంచ మెనింజైటిస్ దినోత్సవాన్ని ఈ వ్యాధి పట్ల అవగాహన పెంచడం మరియు ఈ వ్యాధిని నిర్మూలించడానికి జరుగుతున్న ప్రపంచ ప్రయత్నాలను ముందుకు తీసుకువెళ్లడం, సమస్యను ముందుగా గుర్తించడం మరియు టీకా ద్వారా వ్యాధిని నివారించడం, తద్వారా ప్రాణాలను రక్షించే సామర్థ్యాన్ని ప్రోత్సహించడం కోసం నిర్వహిస్తున్నారు.

ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా 2.5 మిలియన్లకు పైగా మెనింజైటిస్ కేసులు నమోదవుతున్నాయి, ఇది తీవ్రమైన ఆరోగ్య సంక్షోభాన్ని సూచిస్తుంది, ఎందుకంటే ఈ వ్యాధి బారిన పడుతున్న వారిలో దాదాపు 70% మంది ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు.

మెనింజైటిస్ అనేది మెదడు మరియు వెన్నుపాము (మెనింజెస్) చుట్టూ ఉన్న రక్షిత పొరల యొక్క వాపు. సాధారణంగా బ్యాక్టీరియా, ఫంగల్ లేదా వైరల్ ఇన్ఫెక్షన్ వల్ల వస్తుంది. మెనింజైటిస్ బారిన పడిన రోగులలో క్లినికల్ లక్షణాలు , వ్యాధి తీవ్రత (తీవ్రమైన, సబ్-అక్యూట్ లేదా క్రానిక్), మెదడు ప్రమేయం (మెనింగో-ఎన్సెఫాలిటిస్) మరియు శారీరక సమస్యలు (ఉదా. సెప్సిస్) ఆధారంగా మారుతూ ఉంటాయి. మెనింజైటిస్ యొక్క సాధారణ లక్షణాలు మెడ పట్టేయడం , జ్వరం, గందరగోళం లేదా మానసిక స్థితి మారడం, తలనొప్పి, వికారం మరియు వాంతులు వంటివి ఉంటాయి. తక్కువగా కనిపించే లక్షణాలలో మూర్ఛలు, కోమా మరియు నరాల సంబంధిత లోపాలు (ఉదాహరణకు వినికిడి లేదా దృష్టి లోపం, అభిజ్ఞా బలహీనత లేదా అవ-యవాల బలహీనత) ఉంటాయి.

మెనింజైటిస్-సంబంధిత మరణాలు అత్యధికంగా ఉన్న మొదటి మూడు దేశాలలో భారతదేశం ఉంది. అక్యూట్ బాక్టీరియల్ మెనింజైటిస్‌కు కారణమయ్యే మూడు వ్యాధికారక కారకాలలో, నీసేరియా మెనింజైటిడిస్ ఒకటి. చికిత్స ఉన్నప్పటికీ 15% వరకు మరియు చికిత్స చేయనప్పుడు 50% వరకు మరణాల రేటును ఇది కలిగి ఉంది. 2 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో తీవ్రమైన బాక్టీరియల్ మెనింజైటిస్‌కు కారణమయ్యే నీసేరియా మెనింజైటిడిస్ పెరుగుదలను అధ్యయనాలు చూపించాయి.

ఈ పరిస్థితి గురించి డాక్టర్ ఖిజర్ బాషా, కన్సల్టెంట్ పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్, అను మై బేబీ హాస్పిటల్ మాట్లాడుతూ , "మెనింజైటిస్ అకస్మాత్తుగా వస్తుంది, కానీ సమయానికి తగిన రీతిలో టీకాలు వేయడంతో మనం దానిని అడ్డుకోవచ్చు. వ్యక్తులు మరియు సంఘాలు రెండింటినీ రక్షించడంలో సకాలంలో రోగనిరోధక శక్తిని నిర్ధారించడం చాలా ముఖ్యం. రోగనిరోధక శక్తి లేని వ్యక్తులు మరియు రద్దీగా ఉండే వాతావరణంలో నివసించే కళాశాల విద్యార్థులు వంటి వారు అధిక-ప్రమాదకర వ్యక్తులు టీకాకు ప్రాధాన్యత ఇవ్వాలి.." అని అన్నారు. ఈ ప్రాణాంతక వ్యాధిని ఎదుర్కోవడానికి, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ (ఐఏపి) మెనింగోకాకల్ వ్యాక్సిన్‌ను 9-23 నెలల మధ్య 2-డోస్ లుగా ఇవ్వాలని మరియు ఈ వ్యాధి వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉన్న 2 సంవత్సరాల కంటే ఎక్కువ వయసు వారికి ఒక డోస్‌గా సిఫార్సు చేయబడుతుంది.

మీ పిల్లల వయస్సు 9 నెలలు మరియు అంతకంటే ఎక్కువ ఉంటే, వారు ఇన్వాసివ్ మెనింగోకోకల్ వ్యాధికి వ్యతిరేకంగా టీకాను పొందారని నిర్ధారించుకోవాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు హెచ్ఓ) 2030 నాటికి బ్యాక్టీరియా మెనింజైటిస్ మహమ్మారిని తొలగించే లక్ష్యంతో ఒక రోడ్‌మ్యాప్‌ను ప్రారంభించింది, టీకా-నివారించగల కేసులను 50% మరియు మరణాలను 70% తగ్గించడానికి ప్రయత్నిస్తుంది. మనం ప్రపంచ మెనింజైటిస్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నప్పుడు, మన పిల్లలను మరియు సంఘాలను రక్షించుకోవడానికి కట్టుబడి ఉందాం. ఈరోజు చురుకైన చర్యలు తీసుకోవడం వల్ల రేపటి తరాన్ని రక్షించవచ్చు, అది అందరికీ ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్ధారిస్తుంది.



**డాక్టర్ ఖిజర్ బాషా,**
**కన్సల్టెంట్ పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్,**
**అను మై బేబీ హాస్పిటల్**

# టీకాల ద్వారా పోలియోను నివారించడం : మన భవిష్యత్ ను కాపాడుకోవడం

హైదరాబాద్ : భారతదేశంలోని మేఘాలయలో ఇటీవల బయట పడిన పోలియో కేసు నేపథ్యంలో, ఈ ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా, పోలియోమైలిటిస్ వల్ల కలిగే నిరంతర ముప్పును గుర్తించడం చాలా అవసరం. పోలియో, ఒక తీవ్రమైన వైరల్ అంటువ్యాధి. ప్రధానంగా ఐదేళ్లలోపు పిల్లలను ప్రభావితం చేస్తుంది. ఇది కోలుకోలేని పక్షవాతం మరియు కొన్ని సందర్భాల్లో మరణానికి దారితీస్తుంది. దశాబ్దాలుగా పురోగతి ఉన్నప్పటికీ, ఈ వ్యాధి ప్రపంచ ఆరోగ్యానికి ముప్పుగా మాత్రం మిగిలిపోయింది, ముఖ్యంగా పోలియో రహిత భారతదేశం వంటి దేశాలలో ఇది మరలా రాకుండా నివారించడానికి అప్రమత్తంగా ఉండాలి.

డాక్టర్ శ్రీనివాస్ కళ్యాణి , ప్రొఫెసర్ ఆఫ్ పిడియాట్రిక్స్ , కిడ్స్ క్లినిక్, హైదరాబాద్ వారు మాట్లాడుతూ,"పోలియో నిర్మూలన అనేది కమ్యూనిటీ నేతృత్వంలో సాధించిన విజయం. అయినప్పటికీ మనం విశ్రమించకూడదు. ప్రజా ఆరోగ్య కార్యక్రమాలు కొనసాగించటం ద్వారా టీకాల ఆవశ్యకత, ఆరోగ్య పరీక్షల ప్రాధాన్యత తెలపాలి " అని అన్నారు.

భారతదేశం యొక్క 12-సంవత్సరాల పోలియో-రహిత విజయం ఒక అసాధారణ ప్రజారోగ్య విజయం, ఇది విస్తృతమైన రోగనిరోధక ప్రచార ప్రయత్నాల ద్వారా సాధ్యమైంది. ఇదే విషయమై డాక్టర్ శ్రీనివాస్ వివరిస్తూ, "భారతదేశంలో పోలియో నిర్మూలించబడినప్పటికీ, కొనసాగుతున్న ప్రభుత్వ విద్య చాలా ముఖ్యమైనది. చాలా మంది



తల్లిదండ్రులు ఇప్పటికీ పోలియో యొక్క లక్షణాలను లేదా దీర్ఘకాలిక పరిణామాలను పూర్తిగా అర్థం చేసుకోలేరు. ఈ వ్యాధి తిరిగి రాకుండా చూసుకోవడానికి అవగాహన కీలకం" అని అన్నారు.

ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ అడ్వైజరీ కమిటీ ఆన్ వ్యాక్సిన్స్ అండ్ ఇమ్యునైజేషన్ ప్రాక్టీసెస్ సిఫార్సు చేయబడిన టీకా షెడ్యూల్‌ను ఖచ్చితంగా అనుసరించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. ఇందులో నోటి ద్వారా పోలియో వ్యాక్సిన్ , 6, 10 మరియు 14 వారాలలో నిష్క్రియాత్మక పోలియో వ్యాక్సిన్ , 16-18 నెలలలో మరియు మళ్లీ 4-6 సంవత్సరాలలో బూస్టర్‌లు వేయించాలి..

డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, "పోలియోపై పోరాటం సమిష్టి చర్య యొక్క శక్తిని ప్రదర్శించింది. ఆరోగ్య కార్యకర్తల నుండి స్థానిక సంఘాల వరకు అందరూ తమ వంతు కీలక పాత్ర పోషించారు. ఈ విజయాన్ని నిలబెట్టుకోవడం కోసం వివిధ విభాగాల వ్యాప్తంగా సహకారాన్ని కొనసాగించడం కీలకం" అని అన్నారు.



**-డాక్టర్ శ్రీనివాస్ కళ్యాణి ,**
**ప్రొఫెసర్ ఆఫ్ పిడియాట్రిక్స్ , కిడ్స్ క్లినిక్,**
**హైదరాబాద్**

## సరికొత్త సీరియల్

# చాకిరేవు



(గతవారం తరువాయి)

ఆదెన్న అన్ని నీళ్లను జీవితంలో చూడలేదు. ప్రపంచం అంతం అవుతుందేమోనని అనుమానం కలిగింది. తల పైకెత్తి రెండు వైపులా చూశాడు. నీటి వేగం ఆదెన్నను తోసింది. గంగా, గంగా అని గట్టిగా అరిచాడు.

భర్త అరుపులో భయాన్ని పసిగట్టిన పాపులమ్మ భయంగా, కంగారుగా చీరను కట్టుకొని బయటకు వచ్చింది. అప్పటికే నీరు చాలా దగ్గరకు వచ్చేశాయి. గంగతో పాటు చాలామంది పిల్లలు ఉన్నారు.

నీరు వస్తోందని యువకులకు అర్థమయ్యింది. తమకు దగ్గరలో ఉన్న పిల్లలను కాపాడటానికి అటువైపుకు కదిలారు. నీటి వేగం వల్ల ఈద టానికి కష్టమయ్యింది. ఆదెన్న నీటిలో సొరచేపలా రయ్యిన ఈదాడు.

పాపులమ్మ, ఆదెన్న పిల్లల దగ్గరకు పరిగెత్తారు. యువకులు గట్టిగా అరి చారు. నీటిలో నుండి బయటపడటానికి ఎంత ప్రయత్నించినా కుదరలేదు. పిల్లలను వంకగడ్డ ఎగువవైపుకు పరిగెత్తమని పాపులమ్మ హెచ్చరించింది.

వంకగడ్డకు ఆనుకొని ఉన్న కాటికాపరి గుడిసె మునిగింది, క్షణాల్లో నీటితో కదిలింది. గుడిసెతో పాటు కాటయ్య, కోటమ్మ కొట్టుకుపోతూ ఆదెన్న ఉన్న చోటుకు కొట్టుకు వస్తున్నారు.

గంగతో పాటు కొంతమంది పిల్లలను తీసుకొని పాపులమ్మ వంకగడ్డ మీదకు సుడిగాలిలా దూసుకుపోయింది.

చెట్లను, వంకగడ్డకు ఇరువైపులా ఉన్న ఇసుక తిన్నెలను కోసుకుంటూ నీరు వేగంగా ప్రవహించింది. యువకులు వంక మధ్యలో ఉన్నారు కనుక ఒడ్డుకు రాలేకపోయారు. ఆదెన్న కన్నుల ముందే కొట్టుకుపో యారు. నీటి ప్రవాహంలో పాపులమ్మకు ఆదెన్న కూడా కనపడలేదు. భర్త బతుకుతాడనే నమ్మకాన్ని వదులుకుంది.

అప్పటికే పల్లె ప్రజలు చాలామంది వంకగడ్డకు నిలబడి పెద్ద పెద్దగా కేకలు పెట్టారు. ఆవులు, గేదలు, గుడిసెలు, పిల్లలు, పెద్దలు కొట్టుకు పోవడం చూసి పాపులమ్మ తట్టుకోలేకపోయింది. ఆదెన్న నీటి ప్రవా హం లో కొట్టుకుపోయి ఒక పెద్ద మొద్దు సహాయంతో వంకగడ్డకు చేరుకున్నాడు.

నీరు ఎలా వచ్చాయో ఎవరికీ అర్థంకాలేదు. పాపులమ్మ పిల్లలను తీసుకొని పల్లెలోకి వెళ్లింది. సాయంత్రానికి ఆదెన్న ఇంటికి చేరుకున్నా డు. ఆదెన్న శరీరంలో బలం లేదు, పీనుగు మాదిరయ్యాడు. బతుకుతా డో లేదో చెప్పలేని స్థితిలో ఉన్నాడు.

ఆదెన్నను మంచం మీద పడుకోబెట్టి నాటుమందు ఫక్కీరప్ప దగ్గరకు పాపులమ్మ పరిగెత్తింది. విషయం చెప్పి ఫక్కీరప్పను గుడిసెకు తీసుకె ళ్లింది. కడుపులోకి చాలా నీళ్లు పోయాయని కడుపు మీద రెండు చేతు లతో నొక్కుతూ నీటిని బయటకు తీశాడు.

ఆదెన్న శరీరం చల్లబడింది, అల్లుడి చేతులను రాపిడి చేస్తూ వెచ్చబరిచే ప్రయత్నం చేసింది సుబ్బక్క. ఆదెన్న తమ్ముడు గంగులు గొంగెలు పెట్టి ఏడ్చాడు. గంగులుకు ఆదెన్న అంటే ప్రాణం, అన్నకు ఏమైనా అయితుందేమోనని గింజుకున్నాడు, గుబులుపడ్డాడు.

ఆదెన్న కుడి కాలును పాపులమ్మ, ఎడమ కాలును గంగులు రుద్దుతూ వెచ్చబరిచారు. ఆదెన్న కన్నులు ఉబ్బాయి, ఊపిరి తీసుకోడానికి ఇబ్బంది పడ్డాడు. ఫక్కీరప్ప ఆదెన్నకు ఊపిరి అందించాడు.

ఆదెన్న శరీరం మీద వెచ్చని దుప్పట్లు కప్పారు. చలి తగ్గలేదు, ఇంట్లో ఉన్న సద్దిబట్టలను కప్పి వెచ్చగా ఉంచే ప్రయత్నం చేశారు. చలి ఓటమిని అంగీకరించింది. మెల్లగా ఆదెన్న కన్నులు తెరిచాడు. వేడిగా డికాషన్ నీళ్లు ఇచ్చారు. డికాషన్‌నీళ్లు తాగడంతో ప్రాణం లేచి వచ్చినట్లు అయ్యింది.

కాటయ్య, కోటమ్మలను కాపాడలేకపోయానని భోరున ఏడ్చాడు. కన్నుల ముందే కొట్టుకుపోయారని అందరికీ చెప్పి రాగాలు తీస్తూ నెత్తి, నోరు బాదుకున్నాడు. గంగను హత్తుకొని ప్రేమగా నుదిటి మీద ముద్దు పెట్టా డు. గంగ ముఖంలో భయం, బెదురు మచ్చుకైన కనపడలేదు.

***

వేముల పల్లెకు ఎగువనున్న గంగాదేవిపల్లె చెరువుకట్ట తెగడంతో నీళ్లు వచ్చినట్లు తెలిసింది. నాలుగు రోజుల పాటు వానలు బాగా కురవడంతో చెరువు నిండింది, గండి పడింది.

ఈ మధ్యకాలంలో ఇన్ని నీళ్లను ఎప్పుడూ చూడలేదని, ఇరవై ఏళ్ల క్రిందట ఇలాగే ఒకసారి జరిగిందని సుబ్బక్క తన జ్ఞాపకాలను నెమరేసుకుంది. ఆరోజు రాత్రి పాపులమ్మ ఇంట్లో నిద్రకు చోటు లభిం చలేదు. ఎవరి కన్నులు కూడా నిద్ర లోకంలోకి వెళ్లలేదు. వాళ్ల కన్నులో ఉదయించే ధైర్యం నిద్ర చేయలేకపోయింది. ఎవరూ పడుకోకపోవడంతో గంగ కూడా అందరి మాటలు వింటూ ఆడుకుంది.

సూర్యోదయమయ్యే సమయంలో అందరూ నిద్ర వంకలో గాఢంగా ఈదారు. వేముల పల్లెలో ఎవరికీ పెద్దగా నష్టం జరగలేదు. ఆవులు, గేదలు గంగాదేవి పల్లె వాళ్లవని తెలిసింది. కాటయ్య, కోటమ్మ శవాలు దొరకలేదు, నామ-రూపాలు లేకుండా గుడిసె కొట్టుకుపోయింది. యువకులు బతికి బట్టకట్టారు.

మరుసటి రోజు మధ్యాహ్నం ఆదెన్న లేచాడు. అప్పటికే సుబ్బక్క, పాపు లమ్మ, గంగ నిద్ర లేచి ఎవరిపనుల్లో వాళ్లు నిమగ్నమయ్యారు. ఆదెన్న నిద్ర లేచిన వెంటనే కాటయ్య, కోటమ్మ గురించి ఆరాదీశాడు. వాళ్లు దొరకలేదని, దొరికే అవకాశం ఉందని పాపులమ్మ అబద్ధం చెప్పింది.

సాయత్రం వేడి వేడి నీళ్లతో స్నానం చేసి కోటమ్మ గుడిసెవైపుకు వెళ్లాడు. నిన్నటి వరకు సుఖంగా, హాయిగా బతుకుతున్న వాళ్లు.. నేడు లేరని తెలిసి వెక్కి వెక్కి ఏడ్చాడు. ఈరోజు రేపటికి గతం అవ్వక తప్పదు. గతం గతిస్తుందనే సత్యాన్ని తెలిసి కూడా మనిషికి ఎందుకంత ఉబలాటం?

వంకలో నీటి ప్రవాహం తగ్గింది కానీ ముందులా సాధారణ స్థాయికి రాలేదు. స్వామి, బాపనోళ్ల బట్టలతో పాటు ఆదెన్నకు ఉన్న నాలుగు గాడిదలు కూడా కొట్టుకుపోయాయి. గాడిదలు కొట్టుకుపోవడంతో వాటిని తలుచుకొని తలుచుకొని ఏడ్చాడు. పాపులమ్మ పైకి గంభీరంగా ఉన్నా లోలోపల చితికిపోయింది. నిజానికవి గాడిదలు కావు కన్న బిడ్డలు.

మళ్లీ గాడిదలు కొనే శక్తి లేదు కాబట్టి బట్టల మూటలను వీపుల మీదే మోయాలి. గాడిదెలు ఉంటే గుడిసె నిండుగా ఉండేది. పాపులమ్మ, ఆదెన్నలతో సమానంగా గాడిదెలు చాకీరి చేసేవి, ఎంత బరువునైనా అలవోకగా మోసేవి. గాడిదల మరణంతో గంగ చిట్టిగుండె అతలాకుతలం అయ్యింది.

వంకలో బట్టలు ఉతికి, మూటలుగా కట్టి, గాడిదెల మీద వేసి గుడిసెకు పంపేవారు. గాడిదెలు ఎవరి సహాయం లేకుండానే నేరుగా గుడిసెకు వెళ్లేవి. గాడిదెలకు గ్రాసం పెట్టడం లాంటివి పాపులమ్మ చేసేది. నాలుగు రోజులకు ఒకసారి స్నానం చేయించడం, ఇతర పనులు ఆదెన్న చేసేవాడు. గాడిదెలు లేకపోతే వంకకు బట్టలు తీసుకువెళ్లడం, తీసుకురావడం, గుడిసెల నుండి బట్టలు తీసుకురావడం చాలా కష్టం.

వంకలో నీరు వచ్చాయని కానీ, కోటమ్మ, కాటయ్య కొట్టుకుపోయారనే విషయం బాపనోళ్లకు తెలియదు. తెలిసినా పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. సర్పంచ్ కొండారెడ్డికి విషయం తెలిసి ఆదెన్న, పాపులమ్మ బతికి సచ్చారా లేదా అని అడిగాడు. బతికే ఉన్నారని ఎవరో నిర్ధారించాడు.

***

బట్టలు తీసుకెళ్లి రెండు రోజులు అవుతున్నా ఇంకా తీసుకురాలేదని సావిత్రిని ఆదెన్న గుడిసెకు పంపాడు స్వామి. గుడిసె బయట నుండే పాపులమ్మ అంటూ సావిత్రి కేకలు వేసింది.

'ఏమైంది సావిత్రి?' పాపులమ్మ కంగారుపడుతూ బయటకు వచ్చింది.

'బట్టలు తీసుకురాలేదని అమ్మయ్య, బాపనయ్య ఆదెన్న మీద కోపంగా ఉ న్నారు. వెంటనే పిలుచుకొని రమ్మన్నారు.'

స్వామితో సహా బాపనోళ్ల, సర్పంచ్ బట్టలు నీటిలో కొట్టుకుపోయాయి. ఆ విషయం ఎలా చెప్పాలో తెలియక పాపులమ్మ చేతులు పిసుక్కుంది.

'ఏంటి? బట్టల సంగతి అడిగితే నీళ్లు నములుతున్నావు?' కోపంగా, ఆవేశంగా. అంతలో గుడిసెలో నుండి ఆదెన్న బయటకు వచ్చి 'బట్టలు నీటిలో కొట్టుకుపోయాయి, పదా, నేను బాపనయ్యకు చెప్తానని' సావిత్రితో పాటు ఆదెన్న వెళ్లాడు.

'ఏం రా.. ఆదిగా బట్టలు తీసుకురాలేదే?' పిలక సవరించుకుంటూ అడిగాడు.

'అయ్యా! అదీ.. అదీ అంటూ' ఆదెన్న తడబడ్డాడు.

'అదీ, గిదీ ఏందిరా? బట్టలు ఏమయ్యాయి?' గొంతు పెంచాడు.

'బట్టలు నీటిలో కొట్టుకుపోయాయి' భయంతో శరీరం గజగజా వణికింది.

'దొంగ నా కొడకా, బట్టల ఖరీదు ఎంతో తెలుసా? నీటిలో నువ్వెందుకు కొట్టుకుపోలేదురా, బట్టలను జాగ్రత్త చేయాలని తెలియదా?' పళ్ళు కొరికాడు.

'క్షమించడయ్య, నీటి ఉధృతి ఎక్కువ అవ్వడం వల్ల గాడిదలు కూడా కొట్టుకుపోయాయి.'

'నీ గాడిదలు, నా బట్టలు ఒక్కటారా?' నానా బూతులు తిట్టాడు. నీ సంగతి ఇలా కాదు, రేపు పంచాయితీలో తేలుస్తానని కోపంగా ఇంట్లోకి వెళ్లిపోయాడు.

ఆదెన్న భయంగా వణుకుతూ గుడిసెకు చేరుకొని.. స్వామి ఇంట్లో జరిగిన విషయాన్ని పాపులమ్మ, సుబ్బక్క, గంగులుకు వివరించాడు.

'మనమేమైనా కావాలని బట్టలను వంకలోకి వదిలామా? స్వామికి ఆమాత్రం బుద్ధి లేకపోతే ఎలా?' గంగులు విరిచుకుపడ్డాడు.

సమస్య నుండి ఎలా బయటపడాలో తెలియక ఆదెన్న కుటుంబం సతమతమ-య్యింది.

'ఇలా మాట్లాడితే చంపేస్తారు? ఆదెన్న గంగులును పంచాయితీకి రావద్దన్నాడు.

'నేనూ వస్తాను, నువ్వు ఒక్కడివే వెళ్తే.. నోటికి వచ్చింది మాట్లాడుతారు' ఆవేశపడ్డాడు.

గంగులుకు పెళ్లి కాలేదు, సంబంధాలు చూస్తున్నారు. పెళ్లి కాలేదంటే గంగులుది చిన్న వయసేమీ కాదు. చూడటానికి ఎత్తుగా, బల్లంగా, నల్లగా, రౌడిలా ఉంటాడని, పనీపాట లేకుండా తిరుగుతున్నాడని ఎవరూ అమ్మాయిని ఇవ్వడం లేదు.

గంగులుకు పెళ్లి చేసి పక్కనే ఉన్న గుడిసెలో సంసారం పెట్టాలని ఆదెన్న ఆలోచన, నిర్ణయం. దాని కోసం కొన్ని నెలల నుండి ఎంత ప్రయత్నించినా కుదరడం లేదు. మొన్నే ఒక సంబంధం చూశారు. అమ్మాయి మతి సరిగా లేదని ఆలోచనలో పడ్డారు. అదొకటి పక్కన పెడితే అమ్మాయి, తన కుటుంబం చాలా మంచిది.

రాత్రికి భోజనం చేసి, పడుకోడానికి బయట మంచాలు వేసుకున్నారు. ఆకాశం నిండా చుక్కలు, చుక్కల మధ్యలో చంద్రుడు నిర్మలంగా, ప్రకాశవంతంగా వెలుగుతున్నాడు. మా జీవితాల్లో ప్రశాంతత ఎందుకు లేదని పాపులమ్మ ఆలోచనలో పడింది.

'ఏమైంది? ఏం ఆలోచిస్తున్నావు? రేపటి గురించేనా?' ఆదెన్న పాపులమ్మ వైపు తిరిగాడు.

'ఏం జరగబోతోందో తలుచుకుంటే భయమేస్తోంది, ఈ సమస్య నుండి ఎలా బయటపడాలో అర్థంకావడం లేదు.'

'స్వామి చెడ్డవాడేమీ కాదులే, రేపు కాళ్ల మీద పడితే క్షమిస్తాడు' ఆదెన్న ఏం తప్పు చేశాడు? చేయని తప్పుకు కాళ్ల మీద పడటం ఎందుకు? బడుగు బలహీన వర్గాల భయమే అగ్రకులాల బలం. ఇంకెన్ని సంవత్సరాల పాటు అగ్రకులాల కాళ్లకు సాగిలపడతారు? తిరగాబడలి, పోరాడాలి.

స్వామి క్షమించినా, సర్పంచ్ కొండారెడ్డి క్షమించడని పాపులమ్మకు తెలుసు. కొండారెడ్డి ఏం చేస్తాడోనని తలుచుకొని పక్కనే ఉన్న గంగను గట్టిగా హత్తుకుంది.

ఆకాశంలోని నక్షత్రాలు పాపులమ్మ కన్నుల నుండి రాలాయి. చీకటి, నల్లని చీకటి ఎర్రగా మారింది. చీకట్లో రక్తం, రక్తంలో చీకటి. చీకటి రక్తం, రక్త చీకటి. వంకలో చీకటి పారినట్టు, చీకటితో పాటు రక్తం, నీరు ఉప్పెనలా, సునామిలా ముంచుకు వస్తున్నట్లు.

నీళ్లు, చీకటి, రక్తం కలిసిపోయాయి.

చీకటి నుండి, నీళ్ల నుండి పాపులమ్మ బయటపడాలనుకుంది.

***

బట్టల కోసం పాపులమ్మ కొండారెడ్డి ఇంటికెళ్ళింది. ఆ సమయంలో ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. కొండారెడ్డి ఇల్లు చాలా పెద్దది, సుమారుగా ఐదారు మంది పని చేసేవాళ్లు ఉన్నారు.

'అమ్మ గారు ఊరికి వెళ్లారని తెలియక వచ్చానయ్య, అమ్మ ఎప్పుడు వస్తారు?'

'ఇంకో నాలుగు రోజుల వరకు అమ్మ రాదులే, పదా! లోపల బట్టలున్నాయి మూట కట్టుకుందువు.'

కొండారెడ్డి మొదటి గదిని మాత్రమే పాపులమ్మ బయట నుండి చూసింది. అలాంటిది లోపలికి వచ్చి బట్టలు తీసుకోమనడంతో ఇబ్బందిపడింది. ఎదురుచెప్పలేక గదిలోకి వెళ్లింది. ఇంట్లో ఎటుచూసినా ఖరీదైన వస్తువులు. పడకగదిలో ఉన్న మంచాన్ని పాపులమ్మ ఎప్పుడూ, ఎక్కడా చూడలేదు.

ఇంట్లోని వస్తువులు చూసి నోరెళ్ళబెట్టింది. అడుగులో అడుగు వేసుకుంటూ కళ్ళు పెద్దవి చేసి ఇంటిని చూసింది. మరోసారి అవకాశం వస్తుందో లేదో అన్నట్టు మురిసిపోయింది. కొండారెడ్డి పెద్ద చెక్కపెట్టెని చూపించి, అందులో సద్దిబట్టలు ఉన్నాయన్నాడు.

పెట్టెలో నుండి బట్టలను తీస్తుండగా వెనుక నుండి వీపు మీద చేయి వేశాడు. అయ్యా అంటూ బిగ్గరగా అరిచింది. ఊపిరి.. కెరటంలా ఎగిరి కూలింది. కన్నులు సముద్రాలయ్యాయి, శరీరం కంపించింది. జాతరలో అమ్మవారికి బలిచ్చే బలిపిల్లలా బెదురుకుంది,

నిలబడిన చోటే కుప్పకూలింది.

(మిగతా వచ్చేవారం)



జాని తక్కెడశిల
7259511956

27.10.2024 సూర్య ఆదివారం

# వంద వత్సరాల హైదరాబాద్ అంగడులు



**తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం మినీ భారతం నుండి విశ్వనగరం గా మారింది. ప్రపంచంలోని అన్ని వస్తువులు,బట్టలు , గృహోపకరణాలు ఐక్యా ,డెకత్లాన్,డి.మార్ట్, రత్నదీప్, లక్ష్మీ దీప్ ఇంకా పెద్ద పెద్ద షాపింగ్ మాల్ లు హైదరాబాద్ లో ఉన్నాయి. అయినప్పటికీ నిజాం కాలం నాటి నుండి ఎర్రగడ్డ అంగడి , గురువారం గురువారం జరిగే జుమ్మేరాత్ బజార్ లలో అగ్గి పెట్టె నుండి అలంకరణ వస్తువులు , కాళ్ళ పట్టీల నుండి కంప్యూటర్ విడిభాగాలు, ఇంట్లో వాడుకునే వస్తువులు, పేద, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరలో బట్టలు, గృహోపకరణాలు ఉదయం 5 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు దొరుకుతున్నాయి.ప్రపంచం కు గ్రామంగా మారి శాస్త్ర, సాంకేతిక, వైజ్ఞానిక రంగాలలో ఎంతో అభివృద్ధి సాధించిన, ఆన్లైన్ మార్కెట్ అందుబాటులో ఉన్నా గత కొంత కాలంగా ఆదివారం వచ్చిందంటే అంగడిల సందడి ఊపందుకుంటుంది వివిధ పేర్లతో భాగ్యనగరం లో పలు పేర్లతో పిలవబడుతున్న వివిధ మార్కెట్ల గురించి ప్రత్యేక కథనం...**

తెలంగాణలోని 33 జిల్లాల నుండి, వివిధ మండలాల నుండి, వివిధ గ్రామాల నుండి ప్రజలు శుభ, అశుభ కార్యాలకు ఏమి కొనాలన్నా ప్రజలు హైదరాబాద్ కు వస్తుంటారు. హైదరాబాద్ బట్టలకు, బంగారు, వెండి నగలకు,గాజులకు,ఈత్తర్, వస్త్రాలకు మిగతా సామానులకు ఎంతో ప్రాముఖ్యత కలిగి ప్రసిద్ధి పొందింది. హైద్రాబాద్ బిర్యానీ,మండీ కి ప్రసిద్ధి. హైదరాబాద్ లో బిర్యానీ,చైనిస్ వంటలు, అరేబియా, మొగలాయి వంటలు, ఎగ్ పప్, కర్రీ పప్, ఫాస్ట్ ఫుడ్, పిజ్జా, బర్జర్, మొదలైనవి అనేక ప్రాంతాల్లో అందుబాటులో ఉంటాయి.

అంగడిని సంత, మార్కెట్,బజారు అనే పేర్లతో పిలుస్తారు. హైదరాబాద్ అనేక మార్కెట్లకు ప్రసిద్ది చెందింది. మోండా మార్కెట్, బేగంబజార్, చార్మినార్ చుడి మార్కెట్,మిరాలం మండీ,గుడిమల్కాపురం, గౌలిపుర, జియగూడ, కాచిగూడ, సికింద్రాబాద్,దిల్ సుఖ్ నగర్, ఆమీర్ పేట్, బాల్ నగర్, బోయిన్ పల్లి, రైతు బజార్లు ఈ విధంగా అనేక ప్రాంతాలలో ప్రజలకు కావల్సిన అన్ని సరుకులు అందుబాటు ధరల్లో దొరకడం హైదరాబాద్ ప్రత్యేకత. ప్రతి రోజూ అంగడి (సంత) ల పేరిట హైదరాబాద్ లోని అనేక ప్రాంతాలలో ముఖ్యంగా మురికివాడలలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, బట్టలు అమ్ముతున్నారు. గ్రామీణ వాతావరణం హైదరాబాద్ లోని అంగడిలలో మనకు ఇంకా స్పష్టంగా కన్పిస్తుంది. ఎంతో అభివృద్ధి సాధించిన మన దేశంలో ఉన్న సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు అలంకరణలు అంగడి లలో కన్పిస్తున్నాయి.

## ఎర్రగడ్డ అంగడి :

అమీర్ పేట్ కు కూకుట్ పల్లికి మధ్యలో బోరబండ కు కి.మీ దూరంలో ఎర్రగడ్డ అంగడి ఆదివారం ఆదివారం జరుగుతుంది. ఎర్రగడ్డ అంగడి 1910 లో ప్రారంభమైనది. ఎర్రగడ్డ అంగడి లో సూదులు,పిన్నీసులు,టిక్లీలు, చేతులకు, కాళ్ళకు పెట్టుకునే రకరకాల నెయిల్ పాలిష్, క్రోన్, వివిధ దుకాణాలు,తాళం చేతులు పోతే రిపేర్ చేసేవారు,గొడుగులను, బ్యాగులను రిపేర్ చేసేవారు, తూకం రాళ్ళు, తూకం బాట్లు,పాత సైకిళ్ళు,
పెద్ద పెద్ద దేకీసాలు, స్టీల్, రాగి, **(మిగతా 8వ పేజీలో)**



(7వపేజీ తరువాయి)
ఇత్తడి పాత్రలు, టెంట్ హౌస్ సామాన్లు, రేడియోలు,టి.వీ లు, కంప్యూటర్ లు, కంప్యూటర్ విడిభాగాలు,పాత బట్టలు, గొంగళి లు,గృహోపకరణాలు దొరుకుతాయి.ఎర్రగడ్డ అంగడి కి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చి వారానికి కావల్సిన వస్తువులు కొనుక్కుని వెళ్తుంటారు.



**అబిడ్స్ :** ఆరో నిజాం కాలంలో అల్ బర్ట్ అబిడ్ అనే యూదుడు ప్యాలెస్ టాకీస్ దగ్గర ఓ షాప్ పెట్టుకున్నాడు. దానికి అబిడ్ అండ్ కంపెనీ అనే పేరు పెట్టాడు. కాలక్రమంలో ఆ ప్రాంతం కాస్తా అబిడ్స్ గా మారిపోయింది.గతంలో అబిడ్స్ లో అన్ని గడియారాలు బాగు చేసే మార్కెట్ ఉండేది.ప్రపంచీకరణ వలన శాస్త్ర సాంకేతిక వైజ్ఞానిక రంగాల్లో అభివృద్ధి సాధించడం వలన సెల్ ఫోన్ నిత్యావసర సరుకుగా మారింది.గడియారాల మార్కెట్ పోయి ఇప్పుడు సెల్ ఫోన్ ల దుకాణాలు వెలిశాయి.సెల్ ఫోన్ కు సంబంధించిన ప్రతి వస్తువు దొరుకుతుంది.సెల్ ఫోన్ బాగు చేసే టెక్నిషియన్స్ ఉంటారు.పెద్ద అంగడిగా సందడి సందడి ఉంటుంది. అబిడ్స్‌లో గడియారాల దుకాణాలు,బట్టల దుకాణాలు, చెప్పుల దుకాణాలు, బంగారం దుకాణాలతో అంగడిగా లావాదేవీ లు ప్రతిరోజూ జరుగుతాయి.



**కార్వాన్. :** ఒకప్పుడు సాహుకారి కార్వా అని పిలిచే ప్రాంతాన్ని నేడు కార్వాన్ అని పిలుస్తున్నారు.కోహినూర్ వజ్రాన్ని సానపట్టింది ఇక్కడే అని చెప్పుకుంటారు. వజ్రాలు, ముత్యాల వ్యాపారస్తుల సమూహంగా చరిత్రలో ఒక వెలుగు వెలిగిన ప్రాంతం కార్వాన్.



**బేగంబజార్ :** హైదరాబాద్ వ్యాపారులపై దయతో నిజాం సతీమణి హుందాబేగం ఓ ప్రాంతాన్ని రాసిచ్చేసింది. అది కాలక్రమం లో బేగం బజారుగా నిలిచిపోయింది. బేగంబజార్ లో అన్ని వస్తువులు, బట్టలు గృహోపకరణాలు, బంగారం దుకాణాల తో ఎప్పుడు కళకళలాడుతూ అంగడి మాదిరిగా సందడి సందడి ఉంటుంది.



**అఫ్జల్ గంజ్ :** ఐదో నిజాం అఫ్జల్ ఉద్దౌలా ధాన్యం గింజల వ్యాపారులకు బహుమతిగా ఇచ్చిన భూమి కాలక్రమేణా అఫ్జల్ గంజ్ గా మారింది.ఇప్పటికి బియ్యం, షపిండి, పప్పుదినుసులు అఫ్జల్ గంజ్ లో దొరుకుతాయి.



**శాలిబండ :** శాలిబండ అసలు పేరు షా-అలీ-బండ. అప్పట్లో షా అలీ అనే ఒక సూఫీ యోగి పెద్ద బండ నివసించేవాడు. ఆయన పేరు మీదనే ఆ ఏరియాను షా అలీ బండ అని పిలిచేవారు. .కాలక్రమంలో అది శాలిబండగా మారింది.



**హరిబౌలి :** దానికి సమీపంలో హరిబౌలి ఉంది.ఇక్కడ " కోవా" దుకాణాల అంగడి సాగుతుంది.తెలంగాణ రాష్ట్రం లోని 33 జిల్లాల నుండి ఆవు పాలతో బర్రె పాలతో చేసిన "కోవా " అమ్ముతారు." కోవా" అమ్మె దుకాణాలు దాదాపు 150 వరకు ఉంటాయి. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల మిఠాయి దుకాణాల యజమానులు, శుభ కార్యాలు చేసుకునే వారు ఇక్కడికి వచ్చి కోవా కొనుక్కుని తీసుకొని పోతారు. ముఖ్యంగా గులాబ్ జామున్ ఇంకా అనేక మిఠాయిలలో " కోవా" విరివిగా ఉపయోగిస్తారు." కోవా " విక్రయాలు జోరుగా జరగడం వల్ల ' కోవబేల" గా పిలుస్తారు.



**మదీనా :** ధర్మదాత ఖాన్ బహద్దూర్ అల్లావుద్దీన్ 1900 సంవత్సరంలో నిర్మించిన మూడంతస్తుల భవనంవల్ల ఈ ప్రాంతానికి మదీనా అనే పేరు వచ్చింది. మదీన దగ్గరలో అనేక బట్టల దుకాణాలు, ఇంట్లో వాడే దుప్పట్లు, బనియన్, శాలువాలు, టవల్స్, రెడిమేడ్ బట్టలు ఒక వర్గం వారు ధరించే రకరకాల బురఖాలు దొరుకుతాయి. పేద ,మధ్య తరగతి ప్రజలకు అందుబాటు ధరలో బట్టలు నాణ్యమైనవి దొరుకుతాయి. మదీన ఎప్పుడు అంగడి గా సందడి సందడి ఉంటుంది.



**చిక్కడపల్లి :** చిక్కడపల్లి అసలు పేరు చిక్కడ్-పల్లి. చిక్కడ్ అంటే మారాఠీలో బురద. ట్యాంక్ బండ్పరీవాహక ప్రాంతం కావడంతో ఆ ఏరియాలో అప్పట్లో మోకాల్లోతు బురద ఉండేది! బురద ఉన్న ప్రదేశం కాబట్టి చిక్కడ్పల్లి అని పిలిచేవారు. కాలక్రమంలో చిక్కడపల్లిగా మారిపోయింది.చిక్కడపల్లి లో కూరగాయల దుకాణాలు, దుస్తులు, పిల్లల నోట్ పుస్తకాలు దొరికే స్టేషనరీ షాపులు, సాంకేతిక పోటో దుకాణాలు బంగారం వెండి రాగి ఇత్తడి దుస్తులు అమ్మె పెద్ద పెద్ద షాపింగ్ కాంప్లెక్స్ లు ఉండి చిక్కడపల్లి అంగడి ఉంటుంది.



**మీరాలం మాండీ :** సికిందర్ ఝా హయాంలో పనిచేసిన మీర్ ఆలం అనే మంత్రి స్మారకార్థం తవ్వించిందే మీరాలం చెరువు. అక్కడే కూరగాయలతోట ఉండేది. దాన్ని మీరాలంమండి అనే వారు. ఇప్పటికీ మీరాలంమండి మార్కెట్ ఫేమస్. మీరాలం మాండీ లో కూడా అంగడి లో దొరికే అన్ని వస్తువులు దొరుకుతాయి.



**తాడ్‌బండ్ :** తాడబండ్ అసలు పేరు తాడ్- షబన్! తాటి చెట్లు ఎక్కువగా ఉండటం వల్ల అలా పిలిచేవారు. కాలక్రమంలో తాడ్ బండ్‌గా మారిపోయింది.తాడ్ బండ్ లో ఆదివారం ఆదివారం సంత జరుగుతుంది.చుట్టు పక్కన కాలనీ వాసులు, మిలట్రీ ( సైనికులు ) కుటుంబ సభ్యులు వచ్చి వారానికి కావాల్సిన కూరగాయలు, ఇంట్లో వాడుకునే వస్తువులు, బట్టలు, గృహోపకరణాలు కొనుక్కుని వెళ్తుంటారు.

(మిగతా 9వ పేజీలో)



**లాడ్ బజార్ లాడ్లీ :** మహ్మద్ ఖులీకుతుబ్ షా భాగమతిలకు మగ సంతానం లేకపోవడంతో కూతురు హయత్ భక్షీ బేగంను గారాబంగా పెంచారు. ఆమెను ముద్దుగా లాడ్లీ అని పిలిచేవారు. చార్మినార్ పక్కన లాడ్ బజార్ లాడ్లీ అనే పేరుమీదనే స్థిరపడింది. లాడ్ బజార్ లో గాజులు,గొట్రు, అత్తరు,షెర్వానీ, పట్టు చీరలు, బట్టలు మొదలైన దుకాణాలు ఉన్నాయి.వివాహా శుభకార్యాలకు, నూతన వధూ వరులకు కావల్సిన అన్ని రకాల వస్తువులు దొరుకుతాయి.లాడ్ బజార్ గాజుల,గోట్ల దుకాణాలు ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నవి.లాడ్ బజార్ అంగడి కి తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాల వారే కాకుండా దేశ,విదేశాల నుండి మహిళలు వచ్చి వారికి కావలసిన గాజులు కొనుక్కుని వెళ్తుం టారు.




**ముర్గీ చౌక్ :** చార్మినార్ సమీపంలో ముర్గీ చౌక్ ఉంది.ఇక్కడ పావురాలు, చిలుకలు, బాతులు,కొంగలు రకరకాల చిలుకలు, రకరకాల పిచ్చుకలు, కాకులు, పిట్టలు మొదలైన అన్ని రకాల పక్షులు దొరుకుతాయి.కోడిమాంసం పెద్ద ఎత్తున అమ్మే దుకాణాలు ఉన్నాయి.పక్షల దుకాణాలు అంగడి ( సంత) జరుగుతుంది.



**ముషీ-రుల్-ముల్క్ :** హుస్సేన్ సాగర్ కు తూర్పున కొంత భూమిని ముషీ-రుల్-ముల్క్ అనే నవాబ్ కు రెండో నిజామ్ కానుకగా ఇచ్చాడు. 1785లో ఆ ప్రాంతంలో ఒక ప్యాలెస్, గార్డెన్ నిర్మించాడు. ముషీ-రుల్-ముల్క్ పేరు మీద ఆ ప్రాంతం మ-ుషీరాబాద్ గా స్థిరపడిపోయింది.ముషీరాబాద్ దగ్గర లో రాం నగర్ చేపల మార్కెట్ చాలా ప్రసిద్ధి.రాం నగర్ లో రకరకాల చేపలు, రొయ్యలు మిగతా సముద్రాలలో దొరికే ఆహారపదార్ధాలు దొరుకు తాయి. రాంనగర్ చేపల మార్కెట్ పెద్ద అంగడి గా సందడి సందడి ఉంటుంది.తెలంగాణ రాష్ట్రం నుండి అనేక మంది ప్రజలు వస్తుంటారు.



**ఉమ్దా బజార్ :** నవాబ్ నిజాం ఆలీ ఖాన్ తల్లి ఉమ్దా బేగం పేరు మీద ఉమ్దా బజార్ ఏర్పడింది. హుస్సేని ఆలంకు ఒక మైలు దూరంలో ఈ ఏరియా ఉంటుంది. ఆసఫ్ జాహీల కాలంలో ఉమ్దా బజార్ షాపింగ్ సెంటర్గా ప్రసిద్ధిగాంచింది.ఇప్పటికి ఇక్కడ ఆదివారం ఆదివారం అంగడి జరుగుతుంది.



**రికాబ్ గంజ్ :** రికాబ్ గంజ్ ని మొదట్లో గంజ్ రికాబ్ అని పిలిచేవారు. తర్వాతి క్రమంలో రికాబ్ గంజ్గా మారింది. రికాబ్ అనేది ఒక కంపెనీ పేరు. గంజ్ అంటే హెూల్ సేల్ షాపింగ్ కాంప్లెక్స్! మొఘలుల కాలంలో ఆ ఏరియాలో మిలటరీ ఆఫీసర్లు ఉండేవారు.ఆదివారం ఆదివారం అంగడి జరుగుతుంది. కూరగాయలు మిగతా వస్తువులు విక్రయిస్తారు.



**చాంద్రాయణగుట్ట :** చెన్నకేశవ స్వామి ఆలయం ఉన్న ఆ ప్రాంతాన్ని ఒకప్పుడు చెన్నరాయుడి గుట్టగా పిలిచేవారు. కాల క్రమంలో అది చాంద్రాయణగుట్టగా మారిపోయింది. ఆదివారం ఇక్కడ అంగడి జరుగుతుంది.



**చిలకలగూడ :** చిలకలు ఎక్కువగా ఉండేవి కాబట్టి చిలకలగూడకు ఆ పేరొచ్చింది. సాయంత్రం కాగానే పక్కనే ఉన్న సీతాఫల్ మండి మార్కెట్ మీద గుంపులుగుంపులుగా వచ్చి వాలి పళ్లు తిని వెళ్లేవి.సీతాఫలాలు చుట్టూ పక్కల గ్రామాల నుండి ఇక్కడికి తీసుకొని వచ్చి విక్రయిస్తారు.సీతాఫల్ మండిలో ఆదివారం ఆదివారం సంత ( అంగడి) జరుగుతుంది.చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు వచ్చి వారికి కావలసిన వస్తువులు వారానికి సరిపోయేటట్లు కొనుక్కుని వెళ్తుంటారు.




**మంగళ్ హాట్ :** మంగళ్ హాట్ అసలు పేరు మంగళ్ హత్! మంగళ్ అంటే మంగళవారం. హత్ అంటే సంత. ప్రతి మంగళ వారం అక్కడ సంత బజరుగుతుంది కాబట్టి ఆ ప్రాంతాన్ని మంగళ్ హత్ అనే పిలిచేవారు. కాలక్రమంలో మంగళ్హాట్గా మారి పోయింది.



**యాఖుత్ పురా :** హైదరాబాద్ కు చార్మినార్ గుండెకాయ అయితే, పాతబస్తీకి యాఖుత్పురా గుండెకాయ. యాఖుత్ అంటే నీలంరంగు రత్నం అని అర్థం. నిజాం రాజుకి పచ్చలంటే వల్లమాలిన అభిమానం. అందుకే ఆ ఏరియాకు యాఖుత్ పురా అని నవాబే నామకరణం చేశాడు. యాఖుత్ పురాలో ఆదివారం అంగడి (సంత) జరుగుతుంది.కూరగాయలు, బట్టలు, గృహెూపకరణాలు, చెడిపోయిన తాళాలకు తాళం చేతులు, కత్తులను సాన బెట్టె వారు, గొడుగు, బ్యాగులను బాగు చేసేవారు ఉంటారు. హైదరాబాద్ సికింద్రాబాద్ జంట నగరాల్లో రైతు బజార్ లు ఏర్పాటు చేసినప్పటికి అంగడులు ( సంత)ల సంస్కృతి ఉంది. హైదరాబాద్ మినీ భారతం నుండి విశ్వనగరంగా డిజిటల్ నగరం గా హైటెక్ సిటీ గా ఎంతో అభివృద్ధి సాధించిన అంగడి ( సంత )లు ఇంకా ఉండటం విశేషం.

**డాక్టర్. ఎస్. విజయ భాస్కర్,**
**9290826988**

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# మనమందరం కోరుకునే ఇల్లు...

మనసులో మాట



అతుల్ మలిక్రామ్

బాల్కనీలో కూర్చుని సాయంత్రం టీని ఆస్వాదిస్తూ... అందులో నిజంగానే ఏదో అద్భుతం ఉంది. ప్రశాంత వాతావరణంలో ప్రధానంగా నేను, నా కప్పు టీ మరియు ఆకులను మెల్లగా ధ్వంసం చేస్తారు. దీన్నే నేను ఎక్కువగా ఆదరిస్తున్నాను. నేను ఎప్పుడూ మొక్కలను ఇష్టపడతాను మరియు నా తోట ప్రాంతంలో చాలా ఎక్కువ ఉన్నాయి, అందుకే సాధారణంగా నా సాయంత్రం టీని బాల్కనీలో నా అందమైన తోటకి ఎదురుగా కూర్చుంటాను. ఒక సాయంత్రం, నేను నా కప్పు టీతో స్థిరపడుతుండగా, వెంటిలేటర్ దగ్గర ఒక జత పిచ్చుకలు ఎగరడం గమనించాను. మొదట, వారు ఆడుతున్నారని నేను అనుకున్నానుబీ బాల్కనీ కారిడార్ల చుట్టూ అక్కడక్కడ ఎగురుతూ. కానీ, కొంతకాలం వాటిని గమనించిన తర్వాత, నేను కేవలం ఆడటం లేదని గ్రహించానుబీ వారు తమ గూడును నిర్మించుకోవడానికి ఒక మూల వెతుకుతున్నారు. సరైన మూలను కనుగొనాలనే వారి తపన, నేను కూడా ఎక్కడికో చెందినవాడిని, చాలా కాలం పాటు ఉండేదాన్ని సృష్టించే స్థలం కోసం వెతుకుతున్న ఆ పాత రోజులను నాకు గుర్తు చేసింది.

కొన్ని రోజుల తర్వాత, నేను మళ్ళీ నా సాధారణ ప్రదేశంలో కూర్చున్నాను, పక్షులు కొమ్మలు, ఆకులు, గడ్డిని సేకరించి, వాటి గూడును నిర్మించడానికి వాటిని జాగ్రత్తగా నా బాల్కనీకి కుడి వైపుకు తీసుకురావడం చూశాను. పదే పదే చూసినప్పుడు బోరింగ్‌గా వస్తుందని ప్రజలు అంటున్నారు. కానీ నేను పూర్తిగా ఏకీభవించను. చిన్న జీవులు ఏమీ లేకుండా అసాధారణమైనదాన్ని సృష్టించడం చూడటం నాకు ఎనలేని ఆనందాన్ని ఇచ్చింది. ప్రతి కొమ్మ ఒకచోట చేరడంతో, అది ఇంటికి దగ్గరగా ఉన్నట్లు అనిపించింది.

పక్షులు అన్నింటినీ కలిపి ఉంచడాన్ని నేను చూస్తూనే ఉన్నాను, ఈ




మూలను ఎవ్వరూ నాశనం చేయలేరని వారు విశ్వసించే ఈ మూలను ఎంచుకోవడానికి వారు చూపిన శ్రద్ధ గురించి నేను ఆలోచించకుండా ఉండలేకపోయాను. అయినప్పటికీ, మనం ఎంత తరచుగా తెలిసి లేదా తెలియకుండా ఇలాంటి ఇళ్లను కూల్చివేస్తాము? చాలా అంకితభావంతో మరియు శ్రద్ధతో నిర్మించబడిన గృహాలు. మరియు కారణం? కేవలం స్థలం శుభ్రం చేయడానికేనా లేక మన సౌలభ్యం కోసమా? వారు ఎంతో ప్రేమగా కట్టుకున్న ఇంటిని, ఇంత క్రూరంగా ధ్వంసం చేయడం చూసి వారికి ఏమనిపిస్తుందో ఊహించగలరా. సూర్యాస్తమయం తర్వాత వారు ప్రతిరోజూ వచ్చే ఇల్లు, ఇప్పుడు శిథిలావస్థలో ఉంది, వారికి ఆశ్రయం లేకుండా పోయింది. స్పైడర్ వెబ్‌ని ఉదాహరణగా తీసుకోండి, దాన్ని స్వైప్ చేయడానికి ఒక్క నిమిషం కూడా పట్టదు, కానీ ఎక్కువ గంటలు లేదా రోజులు నేయబడి ఉండాలి.

ఇది కేవలం మూగ పక్షులకే కాదు, పేదలు కూడా ఇలాంటి కష్టాలను ఎదుర్కొంటారు. వారు తమ పొట్ట నింపుకోవడానికి అవిశ్రాంతంగా శ్రమించాల్సి వచ్చింది, ఇల్లు ఉండడం మర్చిపోయారు. వారు ఆశ్రయం పొందగల స్థలం, పాడుబడిన భవనాలు, చెరువులు లేదా కాలువల సమీపంలోని ప్రాంతాల వంటి మరచిపోయిన ప్రదేశాల కోసం వెతుకుతా రు. మనకు గగుర్పాటు మరియు అసహ్యం కలిగించే ఈ ప్రదేశాలు ఈ పేదలు తమ ఆనందాన్ని పొందే ప్రదేశాలు. వారికి ఇతర ఎంపికలు కూడా లేవు. అదే సమయంలో, ఈ శాంతి కేవలం ఉపశమనం యొక్క క్షణం మాత్రమే అని వారికి తెలుసు. ఒక వంతెన లేదా ఏదైనా సెటిల్‌మెంట్‌ను ప్లాన్ చేసినా లేదా ఎప్పుడు అనుకున్నా, వారి తాత్కాలిక ఆశ్రయం రెండో ఆలోచన లేకుండా నాశనం చేయబడు తుందని వారు బాధాకరమైన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోసారి తమ సొంతమని చెప్పుకునే చోటు లేకుండా పోతుంది.

మురికి గుడిసె అయినా, ఇరుకైన 1%BHK ఫ్లాట్ అయినా, పెద్ద మాన్షన్ అయినా సరే, ఒక కుటుంబంతో ప్రేమగా నివసించే ప్రతి ప్రదేశం ఒక ఇల్లు అని నేను భావిస్తున్నాను. ఇంటి సారాంశం దాని గోడల మధ్య ప్రజలు పంచుకునే ప్రేమలో ఉంది. ప్రతి ఒక్కరికీ, వారు ఎవరైనా సరే, వారు ఎంతో కష్టపడి నిర్మించుకున్న ఇల్లు ఎల్లప్పుడూ ఇల్లు– సాలీడు తన సున్నితమైన వల నేయడం, పక్షి గూడు కట్టుకోవడం, రంధ్రంలో ఎలుక– ఇవన్నీ ఇంటిని సృష్టిస్తాయి– వారు సురక్షితంగా మరియు చెందినవిగా భావించే ప్రదేశం.

అయినప్పటికీ, పేదల విషయానికి వస్తే, వారి ఇళ్లను అభివృద్ధి పేరుతో తరచుగా త్యాగం చేస్తున్నారు. ప్రభుత్వం మరియు పరిపాలన ఎల్లప్పుడూ వారి ఆశ్రయాన్ని కూల్చివేసేందుకు రెండవ ఆలోచన లేకుండా హడావిడిగా ఉంటాయి. రాజకీయ పార్టీలు 'సరైన ఇళ్లు', 'మెరుగైన విద్య' అంటూ పెద్ద పెద్ద వాగ్దానాలు చేస్తుంటే, ఎన్నికలు ముగియగానే తాము మాట్లాడినవన్నీ మర్చిపోతున్నాయి.

బుల్‌డోజర్‌లు తమ సురక్షితమైన స్వర్గాన్ని ఇంత క్రూరంగా ఎలా కూల్చివేస్తారో ఆలోచించడం నాకు బాధగా ఉంది. వారి ఇళ్లను ధ్వంసం చేసే ముందు వారికి నివాసం ఉండేలా ప్రభుత్వం ఆలోచించాలి. వారికి భూమి లేదా ఇళ్లు కేటాయించాలి, తద్వారా భవిష్యత్తులో కూడా వారిని ఎవరూ నాశనం చేయకూడదు, ఎక్కడో వారు గౌరవంగా, ఆనందంగా మరియు శాంతితో జీవించగలరు అన్నింటికంటే, ఇది మానవత్వాన్ని పణంగా పెడితే అది అభివృద్ధి కాదు!

---

హాలీవుడ్ సినిమాలు ఎక్కువగా చూసేవారికి 'వెనమ్' సిరీస్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ముఖ్యంగా సూపర్ హీరో సినిమాలు చూసేవాళ్లు 'వెనమ్' సినిమాను అస్సలు మిస్ అవ్వరు. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు రెండు సినిమాలు వచ్చాయి. ఈ రెండు సినిమాలూ బ్లాక్‌బస్టర్లుగా నిలిచాయి. మూడో సినిమాతో ఈ సిరీస్‌ను ఎండ్ చేస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. అదే 'వెనమ్: ది లాస్ట్ డ్యాన్స్'. ఈ సినిమా గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అసలు ఇంతకీ ఈ సినిమా ఎలా ఉంది?

**కథ:**

రెండో పార్ట్ అయిన 'వెనమ్: లెట్ దేర్ బి కార్నేజ్' సంఘటన అనంతరం ఎడ్డీ బ్రాక్ (టామ్ హార్డీ) మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ అవుతాడు. వెనమ్‌ని కూడా తన గ్రహానికి చెందిన వాసులు వెంటాడుతూ ఉంటాయి. దీంతో వారిద్దరూ పారిపోతూనే ఉంటారు. ఇంతలో వీరిద్దరికీ ఒక కొత్త ప్రమాదం ఎదురవుతుంది. వేరే లోకంలో బంధించి ఉన్న నల్ (ఆండీ సెర్కిస్) అనే సూపర్ విలన్ విడుదలకు అవసరమైన ఒక ఎలిమెంట్ ఈ మొత్తం విశ్వంలో వీరి దగ్గర మాత్రమే ఉంటుంది.

దీంతో నల్ సైన్యం కూడా వీరిని వేటాడుతూనే ఉంటుంది. నల్ సైన్యం నుంచి తప్పించుకోవాలంటే అయితే ఎడ్డీ, వెనమ్‌ల్లో ఒకరు మరణించాలి లేదా జీవితాంతం పరిగెడుతూనే ఉండాలి. మరి ఇలాంటి పరిస్థితుల్లో ఎడ్డీ, వెనమ్ ఏం చేశారు? జీవితమంతా పరిగెడుతూ ఉన్నారా? లేకపోతే ఇద్దరిలో ఒకరు ప్రాణత్యాగం చేశారా? అన్నది తెలియాలంటే 'వెనమ్: ది లాస్ట్ డ్యాన్స్' చూడాల్సిందే.

విశ్లేషణ:

సూపర్ హీరో సినిమాలు అంటే మనందరం ఎదురు చూసేది కళ్లు



చెదిరే యాక్షన్ ఎపిసోడ్లు. ఈ విషయంలో 'వెనమ్: ది లాస్ట్ డ్యాన్స్' ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ప్రారంభంలో వచ్చే ఫైట్ మీద యాక్షన్ ఎపిసోడ్ దగ్గర నుంచి ఒక మూడు సాలిడ్ యాక్షన్ బ్లాక్‌లు పడ్డాయి. దాదాపు 20 నిమిషాల పాటు సాగే క్లైమ్యాక్స్ యాక్షన్ ఎపిసోడ్ సినిమాలో హైలెట్. ఒక పెద్ద శత్రువు కోసం వెనమ్, ఇతర సింబియోట్లు, మిలటరీ అందరూ కలిసి చేసే పోరాట సన్నివేశాలు అలరిస్తాయి.

కానీ ఒక సూపర్ హీరోకు ఫేర్‌వెల్ ఇస్తున్నామంటే ఆ సినిమా కేవలం యాక్షన్ పరంగానే కాకుండా ఎమోషన్ పరంగా కూడా హై స్టాండర్డ్స్‌లో ఉండాలి. గతంలో వచ్చిన 'లోగన్', 'అవెంజర్స్: ఎండ్ గేమ్' 'గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ 3' ఈ విషయంలో చాలా హయ్యస్ట్ మీటర్‌ను సెట్ చేశాయి. ఆ రేంజ్‌లో ఇందులో ఎమోషన్ వర్కవుట్ అయిందా అంటే లేదని చెప్పాలి. ముఖ్యంగా ఎడ్డీ, వెనమ్‌ల మధ్య ఎమోషన్‌ను చూపించే సన్నివేశాలు లేవని చెప్పాలి. ప్రీ క్లైమ్యాక్స్‌కు ముందు వచ్చే ఒక్క సీన్ మాత్రం ఎమోషనల్‌గా కాస్త ఆకట్టుకుంటుంది. అలాగే ఈ సినిమాలో నల్‌కు, వెనమ్‌కు మధ్యలో ఫేస్ ఆఫ్ సీన్లు ఉంటాయని ఫ్యాన్స్ ఎక్స్‌పెక్ట్ చేశారు. కానీ అక్కడ కూడా వారికి నిరాశే ఎదురైంది. నల్ పాత్ర కేవలం కొన్ని నిమిషాల పాటు మాత్రమే కనిపిస్తుంది.

**టెక్నికల్‌గా**

ఈ సినిమా చాలా హై స్టాండర్డ్స్‌లో ఉంది. వీఎఫ్ఎక్స్ టాప్ నాచ్‌లో ఉంది. ఈ విషయంలో ఫ్యాన్స్, ఆడియన్స్ ఎక్కడా డిజప్పాయింట్ అవ్వరు. డాన్ డీకన్ అందించిన నేపథ్య సంగీతం పెద్దగా రిజిస్టర్ అవ్వదు.

**నటీనటుల విషయానికి వస్తే...**

ఇది టామ్ హార్డీ వన్ మ్యాన్ షో. వెనమ్ పాత్ర పోషించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఎడ్డీ బ్రాక్ పాత్రలో ఆయన ఒదిగిపోయారు. లేని వెనమ్‌ని ఊహించుకుని దాంతో కెమిస్ట్రీని పండించడం మామూలు విషయం కాదు. అలాగే ఆయన కామెడీ టైమింగ్ కూడా చాలా బాగుంది. మిగతా పాత్రధారులందరూ వారి పాత్రల మేరకు బాగా నటించారు.

**ఓవరాల్‌గా చూస్తే...**

సూపర్ హీరోకు ఫేర్‌వెల్ ఇస్తున్నారు కాబట్టి ఒక ఎమోషనల్ రైడ్‌ను ఎక్స్‌పెక్ట్ చేస్తే మాత్రం డిజప్పాయింట్ అయ్యే అవకాశం ఉంది. సరదాగా ఒక సూపర్ హీరో సినిమా చూస్తున్నాం అనుకుంటే మాత్రం ఎంటర్‌టైన్ అవుతారు.

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)

నిర్వహణ :
స్వర్ణకంకణ సన్మానిత,
జ్యోతిష్య మార్తాండ,
జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా॥ ఈడ్పుగంటి పద్మజారాణి
91 9849250852,
91 7506976164
padma.suryapaper@gmail.com



## 27.10.2024 నుంచి 2.11.2024 వరకు



### మేష రాశి
అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

వారం ప్రారంభంలోసంతాన అభివృద్ధి పరంగా ముందుకు వెళుతుంది. సంఘంలో గుర్తింపు గౌరవం నూతన పరిచయాలు ఏర్పడతాయి.నూతన వృత్తి కొరకు చేయు ప్రయత్నాలు, ఆగిన పనులు ముందుకు వెళతాయి. ఆరోగ్యం బాగుంటుంది. తోబుట్టువులు విషయాలు, వృత్తి సంబంధించిన ఆలోచనలు ప్రశాంతతనుతగ్గిస్తాయి. పట్టుదలగావ్యవహరించి మిత్రుల సహకారంతో, మీనైపుణ్యమైనకమ్యూనికేషన్తో సాధించుకుంటారు. మీ దగ్గర తీసుకున్న రుణము ఇతరులు కొంత వరకు మీకు చెల్లిస్తారు. పోటీలలో అధిక శ్రమతో నెగ్గుతారు. తల్లితరపు బంధు వర్గాన్ని కలుస్తారు..తల్లిదండ్రులతో కలిసి కొత్త నిర్ణయాలు తీసుకుంటారు వారి సహాయ సహకారాలు ఆశిస్తారువ్యక్తుల వల్ల అవమానములకు గురి కాకుండా మీ మాటలలో వీలైనంత జాగ్రత్తలు తీసుకోవాలి .



### వృషభరాశి
కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

వారం ప్రారంభంలోవిందు వినోదాలు లో పాల్గొనడం, ఉపాసన బలం పెంచుకోవడం.మానసిక ప్రశాంతత చాలా వరకు తక్కువగా ఉంటుంది. పాత ఆలోచనలు అదేపనిగా గుర్తుకు వస్తూ మనసులో స్థిరత్వం తక్కువ.సృజనాత్మకత, భాగస్వామి సంబంధ ఆత్మీయుల రాకపోకలు, సంతాన సంబంధం నూతన పెట్టుబడులు, గృహ సంబంధ ఆదాయాల మీద చర్చలు ఆలోచనలుభూ సంబంధ విషయాల గురించిపెట్టుబడులగురించి,ముందుకుసాగుతాయి. సంఘంలో పలుకుబడి కలిగిన వ్యక్తుల సహకారంతో పనులు సాధించుకుంటారు, ఇంతవరకు ఆగిన పనులు అవలీలగా ముందుకు సాగుతాయి, ఆరోగ్యవిషయంలోశ్రద్ధఅవసరము రోగనిరోధక శక్తిని పెంచుకోవాలి, పాత రుణములను కొంతవరకు తీరుస్తారు.



### మిధున రాశి
మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

వారం ప్రారంభంలోవ్రాత నైపుణ్యాలు పెరుగుతాయి. పట్టుదలగా అనుకున్న పనులు సాధిస్తారు. విద్యా వాహన గృహ సౌకర్యాలు అనుకూలంగా ఉంటాయి. విద్యార్థులు పోటీ పరీక్షలలో శ్రమతో విజయాన్ని సాధిస్తారు .వృత్తిపరమైన అభివృద్ధి. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయిధైర్య సాహసాలు పెరుగుతాయి.స్వతంత్రంగా ఆలోచనలుచేస్తారు. సంతానపరమైనవిషయాలలోసృజనాత్మకఅంశాలలోపెట్టుబడికి సంబంధించినఆలోచనలలో కొత్త నైపుణ్యాలను ప్రదర్శిస్తారు. గృహ వాహన సంబంధ అంశాల కొనుగోలు కొరకు లాభపరమైన నిర్ణయాలు చేయడం జరుగుతుంది. వృత్తిపరంగా అభివృద్ధి, గౌరవం పెరుగుతుంది. ఉన్నత అధికారులతోనూ రాజకీయ నాయకులతోనూ చర్చిస్తారు.



### కర్కాటక రాశి
పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలోఆరోగ్యపరమైన విషయాలలో వ్యక్తిగత శ్రద్ధ అవసరము.వ్యాధినిరోధక శక్తిపెరిగి, శత్రువుల విజయం సాధించి, పూర్వపు రుణములను చెల్లిస్తారు.మానసిక ప్రశాంతత తక్కువగాఉంటుంది. ఖర్చులు ఊహించిన దానికన్నా ఎక్కువగా ఉంటాయిఉద్వేగాలను, కఠినమైన మాటలను కోపాన్ని నియంత్రించుకోవాలికుటుంబ సంబంధమైన ప్రయాణములు, భాగస్వామ్య వ్యవహారాలలో అపార్థాలు రాకుండా జాగ్రత్త వహించాలి.విద్యార్థులకు అనుకూలంగా ఉంటుంది. కమ్యూనికేషన్ బాగుంటుంది. జ్ఞాపక శక్తిని పెంచుకునే విధంగా కృషి చేస్తారు. వ్రాత నై పుణ్యాలు బాగుంటాయి. కొత్త పెట్టుబడుల గురించి ఆలోచన చేస్తారు. విద్యార్థులకు విద్యాపరమైనప్రయాణాలకుఅవకాశంఉంది. పెద్దలతో బేధాలు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలి



### సింహ రాశి
మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

వారం ప్రారంభంలో.చమత్కారంగా మాట్లాడతారు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తూ పనులు సాధించుకుంటారు. ఉద్వేగములు అధికంగా ఉంటాయి. ఆత్మీయుల సహకారముతోడ్పడుతూ అనుకున్న పనులు సాధించుకుంటారు. భూ సంబంధమైన పరమైన అంశాలలో,ఆదాయము బాగా ఉంటుంది.చమత్కారంగా మాట్లాడతారు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. సమయ-స్ఫూర్తిగా వ్యవహరిస్తూ పనులు సాధించుకుంటారు. ఉద్వేగములు అధికంగా ఉంటాయి. ఆత్మీయుల సహకారము తోడ్పడుతూఅనుకున్నపనులుసాధించుకుంటారు. రాజకీయం గా పలుకుబడి కలిగిన వ్యక్తులు ఉన్నత అధికారులు సలహా సంప్రదింపులతో కొంత కా లముగా ఆగి ఉన్న పనులను మొదలుపెడతారు.



### కన్యా రాశి
ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

వారం ప్రారంభంలోవృత్తిపరమైన అధిక శ్రమతో నిద్రలేమి ఇబ్బంది పెడుతుంది.నూతన శక్తితో మనసు ఉత్సాహంగా కొత్త నిర్ణయాలు కొరకుఆలోచనలుచేస్తుంది. విందువినోదాల్లో ఖర్చులుఅధికము .శారీరక శ్రద్ధ, వ్యాయామ ప్రాణయమాలు చేస్తారు .గౌరవముకీర్తిపెరుగుతుంది. సంఘంలోగుర్తింపు, కుటుంబంతో,మిత్రులతోకలిసిసమయాన్నిసద్వినియోగపరచుకుంటారుతోబుట్టులతోఅభిప్రాయబేధాలురాకుండాజాగ్రత్తగావ్యవహరించాలి.సమయస్ఫూర్తితో ఆకర్షణీయముగా మాట్లాడి ఇతరుల మనసును గెలుస్తారు. కుటుంబంలో మీ ఆధిపత్యం పెరుగుతుంది. ఖర్చులు మాత్రమే కాకుండా ఆరోగ్య విషయంలో కూడా కొంత శ్రద్ధ తీసుకోవాలి.వాగ్దానంనిలబెట్టుకోవడం కొంతవరకుకష్టంఅవుతుంది.ధనవిషయంలోఆటంకాలు.శక్తికి మించినఖర్చులు.ఆధ్యాత్మికపరమైనప్రయాణాలు



### తులారాశి
చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

వారం ప్రారంభంలోఉన్నత విద్య కోసం చేసే ప్రయత్నాలు అనుకూలంగా ఉంటాయి. గృహ, వాహన పరమైన లాభాలు. తల్లితండ్రుల సహకారం. కుటుంబ పరమైన విషయాల్లో, బంధువుల కొరకు ఖర్చులు చేస్తారు శిరోవేదనశారీరక శ్రమ నిద్రలేమి, కొంత ఇబ్బందిని కలిగిస్తాయిఆరోగ్య పట్ల శ్రద్ధ పెంచడం మేలు.. మాట్లాడే మాటల వల్ల అభిప్రాయ బేధాలు రాకుండా జాగ్రత్త పడాలి. కంటికి సంబంధించిన విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. నిర్ణయాలు తీసుకుంటారు. ఉన్నత అధికారుల సహకారంతో అనుకున్న పనులు అనుకున్నసమయాన్నిపూర్తిచేస్తారు.వృత్తిపరమైన అభివృద్ధి. క్రింద వారి సహకారము కొంతవరకు తక్కువ ఉన్నప్పటికీ చాకచక్యముతో అన్నిటిని అధిగమిస్తారు. పౌరుషంగా నిర్ణయాలు తీసుకుంటారు.



### వృశ్చిక రాశి
విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంఉద్వేగాలకు లోనై కుటుంబ సంబంధమైన ముఖ్యమైన కార్యక్రమాల లో ఇబ్బందులకు గురవుతారు. ఆ విషయంలో జాగ్రత్త అవసరము. చివరికి వాటన్నిటిని అధిగమిస్తూ కుటుంబ కార్యక్రమాల్లో పాల్గొంటారుఆరోగ్య విషయంలో, ముఖ్యంగా సంతానము యొక్క కంటి ఆరోగ్య శ్రద్ధ అవసరము, గవర్నమెంట్ ఉద్యోగులతో విభేదాలు రాకుండా జాగ్రత్తవహించాలి. గురువుల ఆశీస్సులు లభిస్తాయి ఆకస్మిక వైరాగ్యం ప్రశాంతత తగ్గిస్తుంది.సంతానం వృద్ధి పరంగా ముందుకు సాగుతారు. మీ ఆలోచన విధానం బాగుంటుంది నిర్ణయ సామర్థ్యం పెరుగుతుంది ఇష్టమైన కార్యక్రమాల్ని నిర్వహిస్తారు, కుటుంబంలో వాతావరణంఅనుకూలంగాఉంటుంది.ఎదురుచూస్తున్న వర్తమానాలు అందుకుంటారు మొత్తం మీద లాభదాయకముగా ఉంటుంది. ఇతరుల సహకారం బాగుంటుంది.



### ధనస్సు రాశి
మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరషాఢ 1వ పాదము

ప్రారంభంలోవ్యాపారపరమైనఅంశాలలోజాగ్రత్తలుతీసుకోవాలి.తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదు. దూర ప్రదేశాలలో ఉన్నత విద్య కొరకు ప్రయత్నం చేసే విద్యార్థులకు అధికశ్రమతోకొంతవరకుఅనుకూలంగాఉంటుందినూతన బాధ్యతలు పెరుగుతాయిశ్రమపెరుగుతుంది. వృత్తిపరమైన అంశాలుఅనుకూలంగాఉంటాయి. భాగస్వామితో కలిసి కుటుంబ పరమైన ప్రయాణాలు ఇబ్బంది పడకుండా జాగ్రత్త వహించాలి. వ్యక్తిగత ఆరోగ్యం పై శ్రద్ధ అవసరము.దూర ప్రదేశంలో ఉండే వ్యక్తులతో మాట్లాడేటప్పుడు జగడములు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇతరులతో శత్రుత్వములు రాకుండా వ్యవహరించాలి. వారం మధ్యలో తండ్రి పెద్దల సహకారంతో పాటుగా, సంఘాల పేరు ప్రతిష్టలు కలిగిన వ్యక్తులు కూడా సహకరిస్తారు .



### మకర రాశి
ఉత్తరషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ఠ 1,2 పాదములు

వారం ప్రారంభంలో దూర ప్రదేశములలో ఉండే వ్యక్తుల సహకారంతో పనుల కోసం ప్రణాళికలు ఏర్పరచుకుంటారు. తోబుట్టువులతో అభిప్రాయ బేధములు రాకుండా జాగ్రత్త తీసుకోవాలివారసత్వపు ఆస్తులచర్చలమీద, భూమికి సంబంధించినఅంశాలపట్లశ్రద్ధతీసుకుంటారుమీఆరోగ్యవిషయంలో,రహస్యశత్రువులఅంశాలలో కొత్త ఘర్షణ ఉంటుంది.వృత్తిపరంగా అనుకూలంగాఉంటుందిఉన్నతాధికారులు సహకరిస్తారు కొత్త బాధ్యతలు అప్పచెప్తారు. గృహ సంబంధ అంశాల కొరకు వాహన మార్పుల కొరకు ఆలోచన చేస్తారు. మానసిక ప్రశాంతత తగ్గినప్పటికీ పట్టుదలగా పనులనుసాధించుకుంటారు.విద్యార్థులకుఅనుకూలంగాఉంటుంది సంబంధం లేని వ్యక్తుల జోక్యం దూర ప్రదేశాల్లో ఉండే వారి సలహాల వచ్చే ఆటంకాలు



### కుంభ రాశి
ధనిష్ఠ 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో సంఘాల్లో వ్యాపార రంగంలో అనుభవం ఉన్న నూతన వ్యక్తుల పరిచయాలు. భాగస్వామికి సంబంధించిన వృత్తిపరమైన విషయాలలో, ఆదాయ అంశాలలో ఆకస్మిక మార్పులు. వివాహ సంబంధమైన అంశాలలో తొందర పాటు నిర్ణయాలు తగవు. దీర్ఘకాలిక పెట్టుబడుల విషయం లోనూ, ఇష్టమైన వ్యక్తులతో అభిప్రాయ బేధాలు, ఘ-ర్షణలు రాకుండా జాగ్రత్త వహించాలి.వారం మధ్యలో చేస్తున్న పనుల పట్ల అసంతృప్తి ఆటంకాలు. ఉన్నత విద్య కోసం ప్రయత్నం చేసే విద్యార్థులకు అధిక శ్రమ. తండ్రితో చర్చించి నెమ్మదిగా నిర్ణయాలు తీసుకోవడం కొంతవరకు మంచిది. రావలసిన లాభాలు వాయిదా పడటం వల్ల చికాకులు. అయినప్పటికీ చక్కగా కృషి చేసి రహస్య శత్రువులపై విజయం సాధించి అనుకున్న పనులు సాధించుకుంటారు.



### మీనరాశి
పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలోసంఘములో గౌరవంకీర్తిప్రతిష్టలు నూతనపరిచయాలు, భాగస్వామికి గౌరవం.రుణాలు చెల్లిస్తారు ఆగిపోయిన పనులు ముందుకు పెడతాయి. ఇతర సహకారంతో అనుకున్న పనులను పెద్ద శ్రమ లేకుండా సాధిం చుకుంటారు. శ్రమకు తగిన సన్మానాలు పొందుతారు. మీ శక్తి మీద మీకు నమ్మకం పెరుగుతుందిరోగ నిరోధక శక్తితో పాటు శత్రువులపై విజయం సాధిస్తారు. నూతన వృత్తులకు అవకాశాలు లభిస్తుంది. వారం మధ్యలో ఉన్నత అధికారులతో, ప్రభుత్వ రంగంలో ఉండే వ్యక్తులతో నిదానంగా వ్యవహరించి పనులు ముందుకు తీసుకువెళ్లాలి. గౌరవం తగ్గకుండా చూసుకోండి. ముఖ్యమైన పనులలో ఆటంకాలు మానసిక ఒత్తిడిని పెంచుతాయి.సంతానానికి సంబంధించిన అంశాలలో శుభవార్తలు వింటారు.


స్రవంతి ప్రత్తిపాటి